Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 31 - No.7

May 2025



## దర్శనం
5లో

జీవితాలను వెలిగిస్తుంది

సంపాదకీయం

## యుఇయస్ఐ దర్శనం

# భారతీయ విద్యార్థుల జీవితాలకు వెలుగు

యుఇయస్ఐ పరిచర్య గురించి గుంటూరు కుగ్లర్ హాస్పటల్, మాజీ సూపరింటెండెంట్ డా. సరళా ఎలీషా గారు ఇలా చెప్పారు. "1950లో నేను వెల్లూరులోని మద్రాస్ క్రిష్టియన్ మెడికల్ కాలేజీలో విద్యార్థిగా ఉన్నప్పుడు డెంటల్ సర్జన్‌యైన డా. జాన్ మూడి గారి ద్వారా విద్యార్థి పరిచర్య పరిచయమైంది. ఈ పరిచర్యలో నేను విద్యార్థినిగానే గాక, గుంటూరు కుగ్లర్ హాస్పటల్లో డాక్టర్‌గా, సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సంవత్సరాల్లో కూడా చురుకుగా పాల్గొన్నాను. యుఇయస్ఐ వాక్యానుసారమైన సిద్ధాంతాలను కలిగి విద్యార్థులకు, సంఘాలకు ఎంతో ఉపయోగపడుతుంది. ఒత్తిడి, మాదకద్రవ్యాలు, ఆత్మహత్యలు, తప్పుడు స్నేహాలకు లోనవుతున్న విద్యార్థుల మధ్య యుఇయస్ఐ గొప్ప పరిచర్యను చేస్తుంది. నేను బిషప్‌లకు, పాస్టర్లకు చేస్తున్న మనవి ఏమిటంటే విద్యార్థి పరిచర్యకోసం ప్రార్థించండి, సహకరించండి".

గుంటూరు జిల్లా, తెనాలి, క్రైస్తవ సత్య గ్రంథశాల వ్యవస్థాపకులు మరియు బ్రదరన్ సంఘ కాపరి, మహిమలోకి వెళ్ళిన కట్టుపల్లి యోహాన్ గారు యుఇయస్ఐ పరిచర్య గురించి ఇలా చెప్పారు."మద్రాస్‌లో ప్రారంభమైన యుఇయస్ఐ విద్యార్థుల పరిచర్యను 1960 తొలిదశకంలో ఆంధ్రప్రదేశ్‌లో డా. సరళా ఎలీషా, లిల్లీగ్రేస్, యస్.ఏ. దేవదత్త, యం. జి. సత్యనాథం, దీనబంధు మొదలగువారు చేస్తుంటే వారికి సహాయంగా నేను కూడా కొన్ని సంవత్సరాలు యుఇయస్ఐలో పని చేశాను. వీరు రఫ్‌గా ఉండే విద్యార్థుల్ని రక్షణలోకి నడిపించి, వారు పరిశుద్ధ లేఖనాల్ని క్రమబద్ధంగా పఠించే వారిగా, బలమైన క్రైస్తవ వీరులుగా చేయాలనే సంకల్పంతో కృషిచేసే వారు. అంతేగాక వారు తమ స్వస్థలాల్లోని సంఘాల్లో క్రీస్తు కొరకైన సాక్షులుగా, సంఘానికి సహకారులుగా, మరికొంత మందిని నాయకులుగా తయారు చేస్తూ క్రైస్తవ సంఘాభివృద్ధిలో వారి పాత్రను పోషించడం నేను కళ్ళారా చూస్తున్నాను".

భారతదేశంలోని విద్యార్థుల మధ్య యుఇయస్ఐ పరిచర్య చూపించిన ప్రభావం ఎంతో గొప్పది. విద్యార్థి దశలో దేవున్ని అంగీకరించి ఐఏయస్, ఐపియస్ ఆఫీసర్స్‌గా, డాక్టర్స్‌గా, ఇంజనీర్స్‌గా, సైంటిస్టులుగా, ప్రొఫెసర్స్‌గా, ప్రభుత్వ ఉన్నతోద్యోగులుగా, ఉపాధ్యాయులుగా, నర్స్‌లుగా, పాస్టర్స్‌గా, మిషనరీలుగా, పనిచేస్తూ, సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేస్తున్నారు. వీరు ఇలా తయారవ్వడానికి దేవుని ప్రణాళిక, దేవుడు మన పితరులకు ఇచ్చిన దర్శనమే.

దర్శనం అంటే, ఒక వ్యక్తి లేదా సంస్థ ఎందుకోసం ఉన్నారో, భవిష్యత్‌లో ఎలా ఉండాలో, ఏమి సాధించాలని అనుకొంటున్నారో దానిని గూర్చి మనసులో ఉండే ఊహా చిత్రం లేక కల. వ్యక్తులలో, సంస్థల్లో, సమాజంలో రావాల్సిన మార్పు, కలగాల్సిన అభివృద్ధి గురించి నిత్యం మనస్సులో మెదిలే ఆలోచన, హృదయ అభిలాష.

ప్రొ. ఇనాక్, డా. టియన్ స్టైరెట్, డా. జాన్ మూడి, డేవిడ్ సిసి వాట్సన్, డి. జయపాల్, హెచ్‌యస్ పొన్నురాజ్ మరి కొంతమంది పెద్దల ప్రార్థనా ఫలితంగా, దేవుని చిత్తానుసారంగా 1954వ సం॥ సెప్టెంబర్ 18న యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా (యుఇయస్ఐ) ఏర్పాటైంది. దేవుడు వారికి చక్కని దర్శనాన్ని ఇచ్చాడు. "మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసు క్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం".

దర్శనాన్ని నెరవేర్చడానికి ఏమి చేయాలో తెలియజేసేది మిషన్. "భారతీయ కళాశాల విద్యార్థులను క్రీస్తు సువార్తతో సంధించి వారు సంఘానికి, సమాజానికి సేవ చేసే యేసు క్రీస్తు ప్రభువు శిష్యులుగా తర్ఫీదు చేయడం" యుఇయస్ఐ మిషన్.

దర్శనం లేకపోతే ప్రజలు నశిస్తారని దేవుని వాక్యం చెబుతుంది (సామె 29:18). ప్రపంచంలోని వివిధ వ్యక్తులకు దేవుడిచ్చిన దర్శనం ద్వారా చీకటిలో ఉన్న వారి జీవితాలు వెలిగించబడ్డాయి, వారి స్థితి, గతులు మెరుగయ్యాయి. సమాజంలో అనూహ్య మార్పులు వచ్చాయి.

యుఇయస్ఐలో మన పితరులకు దేవుడిచ్చిన దర్శనం వల్ల భారతదేశంలోని లక్షల మంది విద్యార్థుల జీవితాలు వెలిగించబడ్డాయి. చెడు స్నేహాలు, స్నేహితుల ఒత్తిళ్ళు, ప్రేమ కార్యకలాపాలు, ఒంటరితనం, నిరాశ, అభద్రతా భావాలు, ఆత్మహత్య ఆలోచనలు, మద్యపానం, మత్తుపదార్థాలు, అశ్లీలత వంటి అనైతిక అలవాట్లకు బానిసలై, తల్లి దండ్రులకు, సమాజానికి తీరని వేదనను కలిగిస్తున్న విద్యార్థులు తమ జీవితాల్ని మార్చుకొని, క్రీస్తును పోలి జీవిస్తూ సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేసేవారుగా ఉన్నారు. 70 సంవత్సరాల క్రితం మన పితరులకు దేవుడిచ్చిన దర్శనం నేడు నెరవేరింది, నెరవేరుతూ ఉంది. దర్శనం లేకపోతే లక్షల మంది విద్యార్థులు నశించేవారే. వారిలో మనమూ, మన కుటుంబాలు ఉండేవే.

యుఇయస్ఐలోని మన పితరులు తమ జీవితాల్ని దేవుడు వారికిచ్చిన దర్శన కేంద్రీకృతంగా మలచుకొన్నారు. నశించిపోయే విద్యార్థుల రక్షణ కొరకు అంగలార్చారు, వారి గృహాలు తెరిచారు, ఖర్చుపెట్టారు, సుఖాలు వదులుకున్నారు, బరువులు మోశారు, బంధాలు పెంచుకున్నారు, అనుబంధాలు త్రుంచుకున్నారు, అవమానాన్ని భరించారు, పవిత్రంగా జీవించారు, పరుగెత్తారు, ప్రయాణాలు చేశారు, క్రొవ్వొత్తిలా కరిగిపోయి దావీదు వలె తమ తరానికి గొప్ప సేవ చేసి నిద్రించారు. మనం కూడా వారివలె జీవిస్తూ భారతీయ విద్యార్థి లోకానికి వెలుగుగా ఉందామా?

**– పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్

విద్యార్థి జ్వాల

Vol. 31, No. 7. May 2025
A Publication of
Union of Evangelical Students of India



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod - Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:

STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Years) - Rs. 400
GRADUATES (3 Years) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCRIPTION:

The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account Name : UESI Publication Trust, Andhra Pradesh**
**Account No : 43362371247,**
**SBI Nambur Branch**
**IFSC: SBIN0011994**
**Merchant Name: UESI PUBLICATION TRUST ANDHRA PRADESH**
**UPI ID : uesiptap@sbi**

CONTACT:

The Editor
Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

UPCOMING TOPICS:

June: People in the last days
July: The Man God Uses
August: Evangelism
September: Core Values

**Note:** Please send your writeups on or before **10th of every month**

## దర్శనమా? దర్పమా?

నేపథ్యాలు వేరైనా
నేర్చుకొనేది ఒక్కటే
కథలు వేరైనా కలిపేది ఒక్కటే
వృత్తులు వేరైనా పరిచర్య ఒక్కటే
తలాంతులు వేరైనా తరాలకు అందించేది
కళాశాలల్ని ప్రభావితం చేసేది ఒక్కటే –
యుఇయస్ఐ దర్శనం

నన్నేం చెయ్యమంటావ్? అని ప్రార్థించేలా చేసేది
ప్రభువు పనిని అర్థం అయ్యేలా చేసేది
విధేయతే తప్ప... ఆప్షన్ లేనిది, ఛాయిస్ లేనిది
శ్రమల కోర్చి, నేటి విద్యార్థి లోకాన్ని
వెలుగులోకి నడిపించేది
రెచ్చగొట్టినా, రచ్చకీడ్చినా
చెరలో ఉన్నా చెరగనిది – దర్శనం

స్వార్థపరుల కలలు దర్శనాలై ముందుకు వస్తే
పరిచర్య వెనుకకు పోయి,
దర్శనం లేనివాడు దర్పం ప్రదర్శిస్తే
దాసులు పోయి – బాసులే మిగిలేది.

పౌలు 'కల' చెదిరింది దర్శనం మిగిలింది.
అందరికీ ఆదర్శంగా నిలిచింది
దర్శనం లేని నీ జీవితం ఎవరికి ఆదర్శం?
దేనికి నిదర్శనం?

– **పి. యేసురత్నం,** కాకినాడ

## లోపలి పేజీల్లో...

- యుఇయస్ఐ దర్శనం - భారతీయ విద్యార్థుల జీవితాలకు వెలుగు - 2
- దర్శనమా? దర్పమా? - 3
- ప్రభావితం - ప్రతీ దినపు ప్రాధాన్యత - 4
- దర్శనం జీవితాలను వెలిగిస్తుంది - 5
- మన పూర్వీకుల దర్శనం - 10
- గురియొద్దకే పరిగెత్తుచున్నాను - 14
- దేవుని పిలుపు - ఒక ఐదింతల ప్యాకేజీ - 15
- నోవహు - తన తరంలో నీతిమంతుడు - 18
- దేవుడు నమ్మదగినవాడు- 20
- ఆన్‌లైన్ బెట్టింగ్స్ - 22
- వ్యక్తిగత జీవిత లక్ష్యము - 25
- హైకూలు - 28
- దేవుడిచ్చిన దర్శనాన్ని ఎప్పుడు కోల్పోతాము? - 29
- సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ - 31
- మరణానికి సమాధానం - 32

# ప్రభావితం - ప్రతీ దినపు ప్రాధాన్యత

పఠనం ప్రాధాన్యత అయితే ఫలితం ఎలా ఉంటుందో యస్‌యస్‌సిలో 600/600 మార్కులు సాధించిన మన నేహాంజని ఒక అద్భుతమైన ఉదాహరణ. ఈ అద్భుతమైన ఉదాహరణ మన ఆచరణాత్మక జీవితంగా మారాలంటే ప్రభువే మన ప్రాధాన్యత కావాలి.

ప్రపంచాన్ని ప్రభావితం చేసిన వారిలో ప్రథముడు ప్రభువే. పుట్టుక దగ్గర నుండి పునరుత్థానం వరకు ప్రభువు జీవితాన్ని పరిశీలిస్తే ఆయన ప్రభావం అమోఘమైనది, అబ్బురపరచేది, అవధులు లేనిదిగా చూస్తాం. తక్కువ సంవత్సరాలు భూలోకంలో జీవించి, అతి తక్కువ సంవత్సరాలు సేవించి, అత్యంత ప్రభావం చూపిన వారిలో ప్రభువే ప్రథముడు. ప్రభువు పిల్లల ప్రభావవంతమైన జీవితాలకు ఆయన ఆచరణాత్మక జీవితమే ప్రోత్సాహం.




సాధారణంగా ఒక టీచర్ ఒక క్లాస్‌ని, ఒక హెడ్ మాస్టర్ ఒక స్కూల్‌ని, ఒక ప్రిన్సిపల్ ఒక కాలేజ్‌ని, ఒక ముఖ్యమంత్రి ఒక రాష్ట్రాన్ని, ఒక ప్రధాని, అధ్యక్షుడు ఒక దేశాన్ని ప్రభావితం చేయగల్గుతాడు. కానీ యేసుక్రీస్తు మాటల్లో "మీరు లోకమునకు వెలుగైయున్నారు" అనే విషయాన్ని గ్రహించినప్పుడు తన శిష్యుల ప్రభావాన్ని ఆయన ఎంత ప్రధానమైనదిగా భావించారో అర్థమవుతుంది, ఎంత విస్తృతమైనదో విశదమవుతుంది.

విద్యా సంవత్సరంలో చివరికొచ్చిన మనం, మన పరిచర్య, పరిస్థితులు, ఫలితాలు ఈ నెల చివరి రోజుల్లో చూడబోతున్నాం. ఆయన మన ద్వారా జరిగించిన విషయాల కొరకు ఆయనను ప్రస్తుతించబోతున్నాం.

ఈ సందర్భంలో మనం ఏం చేశామనే దానికన్నా, ఎలా జీవించామనేదే ప్రధాన పాత్ర పోషిస్తుంది. లోకంలో వెలుగు పాత్రను పోషించాల్సిన మనం పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రకాశిస్తూనే ఉండాలి. ప్రకాశానికి ప్రారంభం ప్రభువుతో సంబంధమే. ఎన్నో సంవత్సరాల క్రితం ప్రారంభమైన మన సంబంధం, పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రగతి పథంలో పయనిస్తూనే ఉండాలి.

మన ప్రభావం పరిస్థితులతో సంబంధం లేకుండా ప్రపంచాన్ని ప్రభావితం చేయాలంటే ఆయన ప్రాథమికంగా చెప్పిన విషయాలకే ప్రాధాన్యత ఇవ్వాలి. పరమ తండ్రి హృదయంలో ప్రహర్షం పుట్టించడమే మన ప్రాధాన్యత అయినప్పుడు, ప్రపంచాన్ని ప్రభావితం చేయడమే జీవనశైలి కావాలి. ప్రపంచాన్ని ప్రభావితం చేయడమనేది మన పొరుగు వారితో ప్రారంభమవ్వాలి. 'ఇంట గెలిచి రచ్చ గెలవాలి'.

ప్రభువు పుట్టుక<br>
ప్రభువు ప్రేమ (పట్టించుకొన్న విధానం)<br>
ప్రభువు ప్రార్థన<br>
ప్రభువు ప్రత్యేక జీవన విధానం (పవిత్రత)<br>
ప్రభువు ప్రయాస (పరిచర్య)<br>
ప్రభువు ప్రాణం పెట్టిన తీరు<br>
ప్రభువు పునరుత్థానం<br>
ప్రభువు పునరాగమనం (రెండవరాకడ)

ప్రభువు మనమీద పెట్టుకొన్న ప్రగాఢమైన నమ్మకం ఇవన్నీ మనలను ప్రోత్సహిస్తూనే ఉండాలి. ఆయన పోలికలో, ఆయన ప్రతిబింబాలుగా ప్రజలను, ప్రభుత్వాలను, ప్రపంచాన్ని ప్రభావితం చేస్తూనే ఉండాలి. ప్రభువు రాకడ వరకు ప్రగతి పథంలో వెళ్తూనే ఉండాలి. ఇది జరగాలంటే పవిత్ర లేఖనాల పఠనంతో పాటు, ప్రభావితం మన ప్రతీ దినపు ప్రాధాన్యత కావాలని కోరుకొంటూ...

ఆయన ప్రణాళికలో మీ....


**ఆర్. శ్రీనివాస్**

యుఇయస్ఐ-ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు

# దర్శనం
## జీవితాలను వెలిగిస్తుంది

ఏదో ఒకరోజు ఈ దేశం 'మానవులందరిని దేవుడు సమానంగా సృజించాడు' అనే నమ్మకం ప్రకారం నడుచుకొంటుందని, ఒకప్పటి బానిసల కుమారులు, వారి యజమానుల కుమారులు కలిసి మెలిసి సోదర భావంతో మెలుగుతారని, సమాజంలో అణచివేత, అన్యాయం పోయి స్వేచ్ఛ, సమానత్వం వస్తాయని నేను కల కంటున్నాను...

ఏదో ఒకరోజు నా నలుగురు పిల్లలు వారి రంగును బట్టి కాకుండా వారి వ్యక్తిత్వాన్ని బట్టి గుర్తింపు పొందుతారని, నల్లజాతి, తెల్లజాతి చిన్నారులు సోదర సోదరీల్లా కలిసిపోతారని, "ప్రతి లోయ ఎత్తు చేయవలెను, ప్రతి పర్వతమును ప్రతి కొండను అణచవలెను, వంకరివి చక్కగాను కరుకైనవి సమముగాను ఉండవలెను" (యెషయా 40:4) అనే వాక్యం నెరవేరుతుందని నేను కల కంటున్నాను...



ఏదో ఒకరోజు ఈ నా నిరీక్షణ తప్పక నెరవేరుతుంది. ఇలాంటి విశ్వాసం ఉన్నప్పుడే మనం నిరాశను అధిగమించగలం, కలిసి ప్రార్థించగలం, కలిసి పనిచేయగలం, కలిసి పోరాడగలం, కలిసి సాధించగలం... ఇది 1963 ఆగస్ట్ 28న మార్టిన్ లూథర్‌కింగ్ జూనియర్ వాషింగ్టన్‌లో రెండులక్షల యాభైవేలమంది ప్రజల సమక్షంలో చేసిన చారిత్రక ప్రసంగం, వెలిబుచ్చిన హృదయభారం, నెరవేరాలని కోరుకొన్న కల, కలిగివున్న దర్శనం...

### దర్శనం అంటే...

భవిష్యత్ గురించి మనసులో ఉన్న ఊహాచిత్రం, జీవితంలో రావాల్సిన మార్పు, కలగాల్సిన అభివృద్ధి గురించి నిత్యం మనసులో మెదిలే ఆలోచన, హృదయ అభిలాష; భవిష్యత్‌లో ఎలాంటి మార్పు రావాలని, అభివృద్ధి కలగాలని, ప్రగతి సాధించాలని హృదయం తపిస్తుందో దానిని ఊహించి ప్రణాళిక వేసుకోవడమే దర్శనం కలిగి ఉండడం. అందుకే "దర్శనమంటే ఎవరూ చూడనివాటిని, ఎవరికీ కనపడని వాటిని ముందుగా చూసే కళ" అని అంటారు జోనాథాన్ స్విఫ్ట్.

"దర్శనం కేవలం భవిష్యత్ గురించిన మానసిక ఊహ కాదు, హృదయంలో ఉండే అభివృద్ధి కోసమైన ఆరాటం, ప్రగతి కోసమైన పోరాటం" అని అంటారు రోసాబెత్ మోస్ కేంటర్. అలాంటి "బలమైన కోరికను పుట్టించే భవిష్యత్ చిత్రమే దర్శనం"

అని అంటారు బిల్ హైబిల్స్. వ్యక్తి లేదా సంస్థ ఎందుకోసం ఉన్నారో, ఏమై ఉండాలని ఆశిస్తున్నారో, ఎలాంటి గురికలిగి పని చేయాలని కోరుకొంటున్నారో అదే వారి దర్శనం.

## దర్శనం లేకపోతే ఏమౌతుంది?

దర్శనం లేకపోతే ఎందుకు పుట్టామో, ఎలా జీవించాలో తెలియక, తమకు తోచినట్లు జీవిస్తారు. జీవిత ఉద్దేశం గ్రహించలేరు. అప్పుడు జీవితమంటే "బాల్యం చిగురు, యవ్వనం పొగరు, మధ్యవయస్సు వగరు, వృద్ధాప్యం ఘగరు" అనిపిస్తుంది. లేదా "కొద్దికాలం మానవునిలా బతకడం, తరువాత కుటుంబం కోసం చాకిరి చేయడం, ఆ తరువాత మనుమ సంతానం కోసం ఇంట్లో కాపలా కాయడం, చివరికి ఆ కొమ్మ నుంచి ఈ కొమ్మకు గెంతే కోతిలా పిల్లల వద్దకు తిరుగుతూ కాలం గడపడం" అనుకొంటారు. దర్శనం లేనివారు ఇలాంటి ఆలోచనలతోనే జీవిస్తారు. భవిష్యత్ గురించి దర్శనం లేని వ్యక్తి, గతంలో జీవిస్తూ ఉంటాడు. దర్శనం కలిగి ఉంటేనే, దానిని సాధించే ద్వారాలు తెరుచుకొంటాయి.

అందుకే "దర్శనం లేకపోతే ప్రజలు నశిస్తారు" (సామె 29:18, ఇంగ్లీష్‌కు అనువాదం) అని బైబిల్ చెబుతుంది. అలాగే "ఈ ప్రపంచంలో అత్యంత దయనీయమైన వ్యక్తి చూపు లేనివాడు కాదు, ఏ దర్శనం లేనివాడు" అని హెలెన్ కెల్లర్ చెప్పారు. "ఈ ప్రపంచంలో అత్యంత పేదవాడు డబ్బు లేనివాడు కాదు, జీవితానికి ఏ కలా లేనివాడు" అని మైల్స్ మన్రోయ్ అన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరు దర్శనం కలిగి జీవించడం అవసరం.

## దర్శనానికి మూలం దేవుడే

దర్శనం మానవుని సొంత ఆలోచన కాదు. జీవితం, జీవం, వెలుగు, జ్ఞానం, ప్రేమ, బలం, మంచితనం మొ॥ వాటిలాగే దర్శనం కూడా దేవుని నుండే కలిగింది. దేవుడు ఒక దర్శనంతోనే సమ-స్తాన్ని సృజించాడు. ఒకవేళ దేవుడు తన దర్శనం రాయాల్సివస్తే "దేవుని స్వరూపం కలిగిన మానవులు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోపరచుకోవాలి. భూమిమీద ప్రతి జీవిని ఏలాలి. దేవుని సన్నిధి, సహవాసం కలిగి నిరంతరం ఆనందంగా జీవించాలి" (ఆది 1:28) అని రాయవచ్చు.

తన దర్శనం నెరవేరడానికి దేవుడు మానవులకు వివాహం ద్వారా కుటుంబం, పని చేయడానికి వృత్తి, పరిపాలన చేయడానికి ప్రభుత్వం అనే మూడు వ్యవస్థలను ఏర్పాటు చేశాడు. కుటుంబం ద్వారా హృదయంలో ప్రేమ, అనురాగం, ఆప్యాయత కలిగివుంటూ ఫలించి విస్తరించి భూమిని నింపుతారు. వృత్తి ద్వారా దేవుడిచ్చిన మానసిక సామర్థ్యాలైన ఊహ, ఆలోచన, పరిశోధనలతో పనిచేస్తూ అభివృద్ధి పొందుతారు. ప్రభుత్వం ద్వారా సామాజిక నిర్మాణంలో సహకారం, ఐక్యత కలిగి ఒకరికొకరు సేవచేస్తూ భూమిని లోపరచుకొని ఏలుతారు. దీనంతటిలో దేవుని సన్నిధి, సహవాసం కేంద్రంగా కలిగి నిరంతరం ఆనందంగా జీవిస్తారు.

## దేవుడు దర్శనాన్ని తెలియజేసిన విధానాలు

### 1. విషయాన్ని తెలియజేయడం

దేవుడు భవిష్యత్‌లో జరిగే సంగతులను ముందుగా ప్రవక్తలకు తెలియజేశాడు. ఉదా॥ యేసు పుట్టుక గురించి యెషయాకు, ఇశ్రాయేలీయుల రాజ్య పతనం, సమకూర్పు గురించి యెహెజ్కేలుకు, పరిశుద్ధాత్మ కుమ్మరింపు గురించి యోవేలుకు, భవిష్యత్ రాజ్యాల గురించి దానియేలుకు, అంత్యకాల సంభవాల గురించి యోహానుకు దేవుడు దర్శనాల ద్వారా ప్రవచనాల రూపంలో ముందుగా తెలియజేశాడు. అందుకే "తన సేవకులైన ప్రవక్తలకు తాను సంకల్పించిన దానిని బయలుపరచకుండా ప్రభువైన యెహోవా యేమియు చేయడు" (ఆమో3:7) అని బైబిల్ చెబుతుంది. అయితే ఈ విషయాలు నెరవేరడానికి వారు చేసేదేమీ లేదు.

### 2. వ్యక్తికి బయలుపరచడం

దేవుడు వ్యక్తుల జీవితంలో తన దర్శనాన్ని, ఉద్దేశాన్ని ఆ వ్యక్తులకే బయలుపరిచాడు. ఉదా॥ యోసేపు ప్రధాని అవ్వాలని కలల ద్వారా, మోషే తన ప్రజలను విడిపించాలని మండుచున్న పొదలో నుండి మాట్లాడడం ద్వారా, దావీదు రాజుగా పరిపాలించాలని ప్రవక్తయైన సమూయేలు ద్వారా, మరియ కన్యకగానే గర్భం ధరించాలని దూత ద్వారా, అన్యులు అపవిత్రులు కారు వారితో కలసి పోవాలని పేతురుకు యొప్పేలో దర్శనం ద్వారా, పౌలు, బర్నబాలు అన్యజనులకు సువార్త ప్రకటించాలని పరి

నీ దర్శనం నీ సమయాన్ని వినియోగించడం, స్నేహితులు, అలవాట్లు, వైఖరులు, చదివే పుస్తకాలు, క్రమశిక్షణ, జీవనవిధానం సమస్తం నిర్ణయిస్తుంది. కొన్నిసార్లు దర్శనం గ్రహించినా దానికి కట్టుబడి ఉండడం, కొనసాగడం, నిబద్ధతతో పనిచేయడం కష్టమౌతుంది. మధ్యలో వచ్చే శోధనలు, తాత్కాలిక సుఖాలు, పేరు ప్రఖ్యాతులకై ఆరాటాలు, పెత్తనాలకై పోరాటాలు గురితప్పేలా చేస్తాయి. సాతాను వేసే బలహీనతలనే వలలో చిక్కుకొనే ప్రమాదం ఉంది. అందుకే "నీ కనురెప్పలు ఇటు అటు చూడక సరిగాను, నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను" (సామె 4:25) అని బైబిల్ చెబుతుంది.

శుద్ధాత్మ ద్వారా వ్యక్తిగతంగా బయలుపరిచాడు. ఇవి వారు తమ జీవితంలో నెరవేర్చాల్సిన విషయాలు.

### 3. వ్యక్తి గ్రహించేలా చేయడం

దేవుడు కొంతమందితో ప్రత్యక్షంగా మాట్లాడకుండా వారే దేవుని ఉద్దేశాలను గ్రహించుకొనేలా చేశాడు. ఉదా॥ పడిపోయిన యెరూషలేము ప్రాకారం కట్టాలని నెహెమ్యా హృదయంలో భారం కలిగి ఆ పని నెరవేర్చాడు. తన ప్రజలను రక్షించుకోవాలనే తీవ్రమైన కోరికతో ఎస్తేరు ప్రార్థనా పూర్వకంగా పనిచేసి యూదులను రక్షించింది. యెహోవాయే నిజమైన దేవుడని బలంగా నమ్మిన రూతు అత్త నయోమితో బెత్లేహేము వచ్చి దేవుని ఉద్దేశ్యాలను నెరవేర్చింది. బేతనియలో మరియ అనే స్త్రీ ప్రభువుపై ప్రేమతో ఆయన తల, పాదాలపై అత్తరు పోసి ఆయనను భూస్థాపనకు సిద్ధపరిచింది (మత్త26). వీరందరూ తమ జీవితాలలో దేవుని ఉద్దేశ్యాలను తామే గ్రహించుకొని వాటిని నెరవేర్చారు.

## బాధ్యతలు నెరవేర్చడం దర్శనంలో భాగమే

కుటుంబం గురించి సరైన దృక్పథం కలిగి ఉండాలి. పిల్లలకు వాక్యానుసారమైన దృక్పథాలు ఏర్పడేలా చేయాలి. దైవిక సత్యాలు, విలువలతో వారిని పెంచాలి. కుటుంబాలు సరైన దృక్పథాలు కలిగి ఉంటే ప్రపంచంలోని చాలా సమస్యలు పోయి దేవుని దర్శనం నెరవేరుతుంది. పని ద్వారా దేవుని సాక్షులుగా ఉంటూ యోసేపు, దానియేలు వలే ఇతరులకు సేవచేయాలి. ఉదా॥ వైద్యులు రోగులకు చేసే వైద్యం, టీచరు విద్యార్థులకు నేర్పే పాఠం, పోలీసులు ప్రజలను రక్షించడం, రైతు పంటలు పండించడం, జడ్జి తీర్చే న్యాయం... ఇవన్నీ దేవుని తరుపున ప్రజలకు సేవ చేయడమే.

దర్శనం కలిగినవారు చేస్తున్న సరికొత్త ఆవిష్కరణలు దేవుని దర్శనంలో భాగమే. మానవుడు ఆకాశంలో ఎగరాలనే విల్బర్ట్ రైట్, ఆర్విల్లే రైట్ సోదరుల కల విమానం కనుగొనేలా, ప్రపంచాన్ని వెలిగించాలనే థామస్ ఆల్వా ఎడిసిన్ దృఢసంకల్పం బల్బు కనుగొనేలా చేసింది. చెవిటివారికి మాటలు వినిపించాలనే అలెగ్జాండర్ గ్రాహంబెల్ కుటుంబ ఆశయం టెలిఫోన్ ఆవిష్కరణకు దారితీసింది. నొప్పి తెలియకుండా శస్త్రచికిత్స చేయాలనే విలియం మోర్టాన్ ఆరాటం మత్తుమందు కనుగొనేలా చేసింది. రాజ్యానికి మూల స్తంభాలైన రాజకీయాలు, ఉన్నత పదవులు, న్యాయవ్యవస్థ, మీడియాల్లో విశ్వాసులు చేరేలా క్రైస్తవ సమాజ దృక్పథం మారాలి. దేవుడు యోసేపును ప్రధానిగా, మోషేను నాయకుడిగా, గిద్యోనును న్యాయాధిపతిగా, దావీదును రాజుగా నియమించి తన ఉద్దేశాలు నెరవేర్చుకొన్నాడు. దేవుని దర్శనం నెరవేర్చడానికి ఇవి కీలకరంగాలు.

## దర్శనం నెరవేర్చేందుకు దేవుని ఏర్పాట్లు

ప్రభువైన యేసు ఈ లోకానికి వచ్చింది దేవుని దర్శనం నెరవేర్చడానికే. అందుకే "యెహోవా ఉద్దేశ్యము అతని వలన సఫలమగును... తనకున్న అనుభవజ్ఞానము చేత అనేకులను నిర్దోషులుగా చేయును" (యెష 53:10-11) అనే ప్రవచనం ప్రకారం ప్రాణం పెట్టి తన పనిని నెరవేర్చాడు. ఇక మిగిలిన పని నెరవేర్చడం కోసం పరిశుద్ధాత్మ దేవుడు ఈ లోకానికి వచ్చాడు. ఆ దర్శనం నెరవేర్పులో మనం కూడా భాగస్తులు కావాలని కోరుతున్నాడు. కొందరు సామాజిక సేవ ద్వారా, మరికొందరు సువార్త సేవ ద్వారా దేవుని ప్రేమను మానవులకు తెలియజేసే బాధ్యత మనకు ఇచ్చాడు. అయితే సామాజిక సేవకు పిలవబడినవారు సువార్తను, సువార్త సేవకు పిలవబడినవారు సత్క్రియలను నిర్లక్ష్యం చేయకూడదు. మనుష్యులు కలిగివుండే ప్రతి దర్శనం, చేసే ప్రతి మంచిపని దేవుని దర్శనంలో భాగమే. దేవునికి వెలుపల ఏ మంచీ లేదు. అందుకే "శ్రేష్ఠమైన ప్రతి యీవియు సంపూర్ణమైన ప్రతి

వరమును, పరసంబంధమైనదై, జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చును" (యాకోబు 1:17) అని బైబిల్ చెబుతుంది.

### 1. సామాజిక సేవ:



కుష్టురోగులను, నిరాశ్రయులను, అభాగ్యులను ఆదరించి వారికి ప్రేమను పంచాలనే ఆగ్నేస్ గోన్జా బోజాక్షు హృదయవాంఛ ఆమెను మదర్ థెరిస్సాగా మార్చింది. భారతీయ మహిళల ప్రసూతి మరణాలు ఆపాలనే ఇడా సోఫియా స్కడర్ దర్శనం ఆమె వైద్యవృత్తిని చేపట్టి క్రిష్టియన్ మెడికల్ కాలేజి, వెల్లూరులో స్థాపించేలా చేసింది. శూద్రులుగా, అస్పృస్యులుగా అణిచివేతకు గురౌతున్న నిమ్నవర్గాల కోసం అంబేద్కర్ తపన, ప్రయాస వారి అభ్యున్నతికి కారణమైంది. అలా మానవ జీవితానికి మేలుచేసే నిర్ణయాలన్నీ దర్శనం నుండే పుడతాయి.

దోర్కా అనే మారుపేరుగల తబితా "... ఆమె సత్క్రియలను ధర్మకార్యములను బహుగా చేసియుండెను'' (అపొ. 9:36) అని బైబిల్ చెబుతుంది. అలాగే ప్రభువైన యేసు మంచి సమరయుడి ఉపమానం (లూకా 10:30-37), రాజు కుడివైపున వారిని ఆశీర్వదింప బడినవారని, ఎడమవైపున వారిని శపింపబడినవారని చెప్పిన కథనం (మత్త 25:31-40) ద్వారా తోటివారికి క్రియలో చూపాల్సిన ప్రేమ, చేయాల్సిన సహాయం, సామాజిక సేవ యొక్క ప్రాముఖ్యత వివరించాడు. అలాగే "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు, మీరు లోకమునకు వెలుగై యున్నారు" (మత్త 5:13-16) అని చెప్పడం ద్వారా సత్క్రియల ప్రాముఖ్యతను తెలియజేశాడు.

### 2. సువార్త సేవ

"ఆయన, మనుష్యులందరూ రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవజ్ఞానము గలవారై యుండవలెనని యిచ్ఛయించుచున్నాడు" (1తిమో 2:4) అనే దేవుని దర్శనం నెరవేర్చడానికి "మీరు సర్వ లోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" (మార్కు 16:15) అని ప్రభువైన యేసు చెప్పాడు. ఇది విశ్వాసులందరికి ఇచ్చిన అత్యంత ప్రాముఖ్యమైన ఆజ్ఞ. మొదట పాపులు నిత్య నాశనానికి వెళ్ళకుండా నిత్యజీవం పొందాలని ఆ తరువాత దేవుని దర్శనం ప్రకారం జీవించాలనేది ఆయన హృదయ భారం.

ఈ పని నెరవేర్చడానికి దేవుడు కొందరికి ప్రత్యేక దర్శనం ఇచ్చాడు. పేతురు సంఘం ద్వారా యూదులకు, పౌలు ప్రేషితసేవ ద్వారా అన్యులకు పరిచర్య చేయడానికి పిలిచాడు. ఈ తరంలో సువార్త బాధ్యత బిల్లీగ్రాహంకు, వాక్యం బోధించడం జాన్‌స్టాట్‌కు, ఆలోచనాపరులకు సత్యం తెలియజేయడం నార్మన్ గైస్లెర్‌కు, యువత మధ్య పని లారెన్ కన్నింగ్‌హామ్‌కు, పుస్తక ప్రచురణ జార్జి వర్వర్‌కు, సంఘాలు కట్టడం భక్తసింగ్‌కు, మారుమూల ప్రజలకు సువార్త అందించడం థియోడర్ విలియమ్స్‌కు, విద్యార్థుల మధ్య పరిచర్య హానింగ్‌టన్ ఇనాక్‌కు ఇచ్చాడు. ఇలా ఎందరో దైవసేవకులు, మిషనరీస్ ప్రపంచ నలుమూలలా దర్శనం పొందారు.

### నా దర్శనాన్ని గ్రహించేది ఎలా?

చాలాసార్లు దేవుని దర్శనం పొందిన వారిద్వారా ఆ దర్శనం తరువాతి తరాలకు అందుతుంది. మోషే నుండి యెహోషువాకు, దావీదు నుండి సొలొమోనుకు, ఏలియా నుండి ఎలీషాకు, పేతురు నుండి మార్కుకు, పౌలు నుండి తిమోతికి అలా దేవుడు తన దర్శనాన్ని కొనసాగించాడు. అలాగే యుఇయస్ఐ పరిచర్య ప్రొ. ఇనాక్ నుండి మనకు అందించాడు. ఏ దేశంలో పుడితే అది వారి దేశమైనట్టు, ఏ కుటుంబంలో పుడితే అది వారి కుటుంబమైనట్టు, ఏ పరిచర్య ద్వారా దేవున్ని తెలుసుకొంటే అది వారి దర్శనం కావచ్చు.

ఏ దర్శనమైనా అది వ్యక్తులది కాదు, దేవునిదే. దేవుని నుండే ఎవరికైనా అందుతుంది. దృష్టి కన్నుకు, దృక్పథం మనసుకు, దర్శనం హృదయానికి చెందినవి. కాబట్టి దృక్పథం సరైనదైతే నీ హృదయభారం నీకు

అర్థమవుతుంది. ఏ భారం నీ హృదయంలో ఉందో, ఏది సాధించాలని నీ హృదయం తపిస్తుందో అదే నీ దర్శనం. కొన్నిసార్లు అది నీ అనుభవాల్లోంచి పుట్టవచ్చు, లేదా వెలిగింపు ద్వారా తెలియవచ్చు. అందుకే "ప్రతి ఒక్కరి జీవితానికి ఒక ఉద్దేశ్యం ఉంటుంది. అది నీకు ఎదురైనప్పుడు నీవు దానిని గుర్తిస్తావు" అని అంటారు కేథరిన్ పల్సిఫెర్. అలాగే సంఘంలో నీ బాధ్యతల ప్రకారం సేవచేయాలి. పరిశుద్ధాత్మ దేవుడు ఇచ్చిన వరాలు, నడిపింపు ఆధారంగా పరిచర్య నిర్ణయించుకోవాలి.

## దర్శనం నెరవేర్చడానికి ఏమి చేయాలి?

"గతంలో ఎవరో చెట్టు నాటారు కాబట్టే నేడు నీవు దాని నీడలో కూర్చోగలుగుతున్నావు" అని అంటారు వారెన్ బఫెట్. అలా ముందుగా నాటేవారే దర్శనం కలవారు. వారి ఆలోచన, కృషి ఫలాలే నేడు మనం అనుభవిస్తున్నాం. దర్శనం నీ జీవితానికి గురిని, ఉద్దేశాన్ని, ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే పౌలు "నేను గురియొద్దకే పరుగెత్తు చున్నాను" (ఫిలిప్పీ 3:14) అని చెప్పాడు. దర్శనం ప్రయోజనకరంగా జీవించేలా, ఆటంకాలు అధిగమించేలా సహాయం చేస్తుంది. నీ దర్శనం నిన్ను కొత్త వ్యక్తిగా రూపొందించి ప్రత్యేకమైన వ్యక్తిగా నిలుపుతుంది.

"ఏ పనీ చేయకుండా ఉండే దర్శనం పగటికల లాంటిది. దర్శనం లేకుండా చేసే పని వృథా కాల క్షేపం. దర్శనంతో చేసేపనే ప్రపంచాన్ని మారుస్తుంది" అని అంటారు జోయల్ బేకర్. నీ దర్శనం సాధనకు తగిన పని, చేయడానికి లక్ష్యాలు ఏర్పరచుకోవాలి. ఆ లక్ష్యాల సాధనకు వ్యూహాలు కలిగి ఉండాలి. వ్యూహాల ఆధారంగా ప్రణాళిక సిద్ధపరచుకోవాలి. ఆ ప్రణాళికలో నీ వంతు కృషి చేసినప్పుడు నీ ప్రయత్నాన్ని ప్రభువు సఫలపరుస్తాడు. ప్రభువు తాను పిలిచినవారిని బలపరుస్తాడు. అందుకే "నీవు నిజంగా శ్రద్ధ వహించి ఉత్తేజం కలిగించే దానిపై పనిచేస్తుంటే, వేరొకరు వెనుక నుండి నెట్టవలసిన అవసరం లేదు, నీ దర్శనమే నిన్ను ముందుకు నడిపిస్తుంది" అని అంటారు స్టీవ్‌జాబ్స్. కాబట్టి దర్శనం కలిగి పనిచేయడమంటే దేవునితో కలసి పనిచేయడమే. అందుకే పౌలు "మేము దేవుని జతపనివారమై యున్నాము" (1కొరింథీ 3:9) అని చెప్పాడు.

నీ దర్శనం నీ సమయాన్ని వినియోగించడం, స్నేహితులు, అలవాట్లు, వైఖరులు, చదివే పుస్తకాలు, క్రమశిక్షణ, జీవనవిధానం సమస్తం నిర్ణయిస్తుంది. కొన్నిసార్లు దర్శనం గ్రహించినా దానికి కట్టుబడి ఉండడం, కొనసాగడం, నిబద్ధతతో పనిచేయడం కష్టమౌతుంది. మధ్యలో వచ్చే శోధనలు, తాత్కాలిక సుఖాలు, పేరు ప్రఖ్యాతులకై ఆరాటాలు, పెత్తనాలకై పోరాటాలు గురితప్పేలా చేస్తాయి. సాతాను వేసే బలహీనతలనే వలలో చిక్కుబడే ప్రమాదం ఉంది. అందుకే "నీ కనురెప్పలు ఇటు అటు చూడక సరిగాను, నీ కనురెప్పలు నీ ముందర సూటిగాను చూడవలెను" (సామె 4:25) అని బైబిల్ చెబుతుంది.

## ప్రభువే మనకు మాదిరి

ప్రభువైన యేసు తన దర్శనం నెరవేర్చడానికి శోధన జయించాడు, శ్రద్ధగా పనిచేశాడు, శ్రమను సహించాడు. దర్శనం విషయంలో స్పష్టత కలిగి ఉన్నాడు, స్వస్థతలు చేశాడు, సువార్త ప్రకటించాడు. దర్శనం నెరవేర్చే పనిలో కనికరపడ్డాడు, కలసి పనిచేశాడు, కలసి మెలిగాడు. ఆ దర్శనం కోసం తగ్గించుకొని జీవించాడు, తరువాతి తరాలను తర్ఫీదుచేశాడు, తండ్రితో సమయం గడిపాడు.

ప్రభువును మాదిరిగా తీసుకొని అలా దర్శనం కలిగి పనిచేసిన దైవజనులు రోజులో కనీసం మూడు, నాలుగు గంటలు దేవునితో గడిపేవారు. విశ్వాసంతో, విధేయతతో జీవించారు. అంకితభావంతో గురి కలిగి పనిచేశారు. ఇతరులను ప్రభావితం చేశారు. అలాంటివారి పరిచర్యవల్లే నీ జీవితం వెలిగించబడింది, నీవు ఆశీర్వాదం పొందావు.

ఈ లోకంలో ప్రధానంగా మూడు రకాల వ్యక్తులు ఉంటారు - దేనినైనా సాధించేవారు, సాధించలేము అనేవారు, సాధించేవారిని అడ్డగించేవారు; పనులు చేసేవారు, చేసేది చూసేవారు, చూసి ఆశ్చర్యపోయేవారు; పని చేయడానికి సొంతగా కదిలేవారు, కదిలిస్తే కదిలేవారు, కదిలించినా కదలనివారు. నీవు ఎవరిలా ఉన్నావు? "చావునకై పట్టబడినవారిని నీవు తప్పించుము. నాశనమునందు పడుటకు జోగుచున్న వారిని నీవు రక్షింపవా?" (సామె 24:11) అనే దేవుని పిలుపు, దర్శనం గురించి నీకు పట్టింపులేదా?

– పి. విక్టర్ బాబు (2020 జులై సంచిక నుండి)



# మన పూర్వీకుల దర్శనం

*"దేవ దర్శన ప్రకారమే వెళ్ళితిని...." గలతీ 2:2*



దర్శనం దేవుని దగ్గర నుంచి వస్తుంది. దేవుని దగ్గర నుంచి దర్శనం పొందడం ఒక అంశమైతే, పొందిన దర్శనానికి విధేయత చూపడం మరొక అంశం. దేవుని దర్శనం కలిగి ఉండి దానికి విధేయత చూపక నిర్లక్ష్యంగా జీవించేవారు ఎక్కువ. దర్శనం ఒక వ్యక్తి లేక సహవాసం పట్ల దేవుని ప్రణాళిక. ఈ ప్రణాళికను దేవుడు ఒక వ్యక్తి ద్వారా బయలు పరుస్తాడు. దేవుడు ఒక వ్యక్తిని సంధించినప్పుడు, అతని పట్ల తన ఉద్దేశాలను వ్యక్త పరుస్తాడు. అబ్రహామును పిలిచినప్పుడు అతని ద్వారా ఒక జనాంగాన్ని తన మహిమ కొరకు ఏర్పరచుకోవడం దేవుని ఉద్దేశము. మోషేను పిలిచినప్పుడు తన ప్రజలను ఐగుప్తు బానిసత్వం నుండి విడిపించడం. ప్రభువు పౌలుకు దర్శనమిచ్చినప్పుడు అన్యజనులకు అపొస్తలునిగా నియమించాడు.

దేవుడు తన సార్వభౌమ కృపలో ఒక వ్యక్తిని ఏర్పరచుకొని తన దర్శనాన్ని తెలియజేసి, తన మహిమ కొరకు వాడుకొంటాడు. అలాంటి వారిలో ప్రొ. ఇనాక్ గారు ఒకరు. ఆయన దేవుడు ఏర్పరచుకొన్న పాత్ర. 1949 లో విశాఖలోని వైద్య కళాశాల ప్రొఫెసర్ గా పనిచేస్తున్నప్పుడు దేవుడు ఒక ప్రత్యేక రీతిలో ఆయనతో మాట్లాడటం ప్రారంభించాడు.

1977లో ప్రొ. ఇనాక్ గారిని ఒంగోలుకు ఆహ్వానించాము. శర్మ కళాశాలలో "జీవ పరిణామమా లేక దైవ సృష్టా" అనే అంశం గురించి మాట్లాడడానికి వచ్చారు. రెండు రోజులు ఆయనతో వ్యక్తిగతంగా గడపడానికి అవకాశం దొరికింది. ఆ తరుణంలో విద్యార్థుల మధ్య పరిచర్య చేయాలనే దర్శనం మీకు ఎలా కలిగిందని ఆయనను అడిగాను. ఆయన మాటల్లో "నేను విశాఖపట్టణం కళాశాలలో పనిచేసేటప్పుడు, నా ముందు వందలమంది విద్యార్థులు వెళుతున్నప్పుడు పరిశుద్ధాత్మ దేవుడు నా అంతరాత్మను ప్రశ్నించడం గుర్తించాను. వీళ్ళకు ఎవరు సువార్తను అందిస్తారు? సంఘం కళాశాల ప్రాంగణంలోకి రాలేకపోతుంది. రాత్రులలో మెలకువ వచ్చినప్పుడు కన్నీళ్ళతో మోకాళ్ళపై భారత దేశంలోని విద్యార్థులకై మొరపెట్టేవాడిని. ఏ అగ్నిజ్వాల అయితే దేవుడు తన హృదయములో పెట్టాడో అదే జ్వాలను అలాంటి మనస్సు కలిగిన పట్టభద్రులతో పంచుకొన్నప్పుడు వాళ్ళ హృదయాలు కూడా ప్రజ్వరిల్లడం ప్రారంభమైంది" అని చెప్పాడు.

## దర్శనము - ప్రార్థనతో కట్టబడుతుంది

విద్యార్థుల మధ్య సేవాభారాన్ని చెన్నైలోని

కొంతమంది పట్టభద్రులతో పంచుకొన్నప్పుడు, దేవుడు అదే దర్శనంతో అనేకులను నింపాడు. వారందరు క్రమంగా భారంతో ఈ పరిచర్య నిమిత్తం ప్రార్థించడం మొదలుపెట్టారు. ప్రొ. ఇనాక్ గారి గృహములో జరిగే ప్రార్థనలు ఎంతో జీవంతో ఉండేవి. ఈ సహవాసంలో ప్రేమానురాగాలతో కూడిన దేవుని సన్నిధిని అనుభవించేవారు. ఈ చిన్న ప్రార్థనా గుంపు ఒక గొప్ప జాతీయ సౌవార్తీక ఉద్యమానికి నాంది పలికింది. పి.సి. వర్గీస్ గారు దీనిని "ప్రేయర్ హౌస్ కాదు పవర్ హౌస్"గా అభివర్ణించారు. ఒక గొప్ప చరిత్రకు అది నాంది పలికింది. ఈ దర్శనం ప్రార్థనతో కట్టబడి, ప్రార్థనతో బలపడింది. సిల్వర్ జూబ్లీలో మాట్లాడుతూ ఆనాటి జనరల్ సెక్రెటరీ ఆర్థర్ హోప్ గారు "యుఇయస్ఐ యొక్క స్ట్రాటజీ ప్రార్థన మాత్రమే" అని చెప్పారు.

## దర్శనం - విస్తరణ

వారి దర్శనం కేవలం ఒక రాష్ట్రానికే పరిమితం కాలేదు. చెన్నై, వెల్లూరు, కోయంబత్తూర్‌లలో జరుగుతున్న చిన్న చిన్న ప్రార్థనా గుంపులు కాట్పాడిలో 1954 సెప్టెంబర్ 18న కలిసినప్పుడు వారి దర్శనం దేశమంతటికి విస్తరించాలన్న సంకల్పంతో దానికి "యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా"గా నామకరణం చేశారు. ఆ చిన్న గృహములో ఆనాడు రూపుదిద్దుకొన్న ఈ ఉద్యమం నేడు శాఖోపశాఖలై దేశమంతా వ్యాపించింది. వారి దర్శనం విశ్వాసంతో భవిష్యత్తులోకి తొంగి చూసింది. Vision cannot be taught, but it can be Caught, అన్నట్లు అనేక మంది యౌవ్వన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ ఈ దర్శనంతో పట్టబడి టెంట్ మేకర్‌లుగా, మిషనరీ విద్యార్థులుగా వివిధ ప్రాంతాలకు, ముఖ్యంగా ఉత్తర భారతదేశం వెళ్ళి విద్యార్థి పరిచర్యను ప్రారంభించారు. ఉదాహరణకు భోపాల్‌లో గిట్టిన్స్ ఆయన భార్య, అలహాబాద్‌లో జె.డి. పాటిల్, ఝాన్సీలో మెకై, బుర్లాలో అశోక్ ప్రొధన్, కటక్‌లో దీనబంధు, జంషెడ్‌పూర్‌లో ప్రభాకర్, రాంచీలో చౌదరి, కలకత్తాలో డా. సెనా, రెవ. పెక్, వరంగల్‌లో డా. దేవపాల్, డార్జిలింగ్‌లో జోనాతాన్ మారాజ్, సాగర్ లో డా. తిరుమలై మొదలైన వారు విద్యార్థి పరిచర్యను ప్రారంభించారు.

## దర్శనం - కొనసాగింపు

ఏ దర్శనమైతే మన పితరులు పొందారో ఆ దర్శనాన్ని ఎన్ని అవాంతరాలు ఎదురైనప్పటికీ నిరాశపడక కొనసాగించారు. కొంతమంది అమెరికా డబ్బు కోసం ప్రారంభించారని, మరి కొంతమంది క్రొత్త డినామినేషన్ సంఘం స్థాపిస్తున్నారని విమర్శించారు. ఈ విమర్శలకు కాలమే జవాబు చెబుతుంది అని దేవుని మీద ఆనుకొని ఈ ఉద్యమాన్ని ముందుకు తీసుకొని వెళ్ళారు. దేవుడే ఈ సౌవార్తిక ఉద్యమము వెనుక ఉన్నాడని, విమర్శలన్నీ నిరాధారములని ఋజువైనాయి. 1954 లో మద్రాసులో జరిగిన చారిత్రాత్మక మీటింగ్ నందు మన పెద్దలు ఒక చెరగని నిర్ణయం తీసుకొన్నారు. యుఇయస్ఐ ప్రతి ఆర్థిక, ఆర్థికేతర అవసరాలకు విశ్వాసముతో దేవునిపైన మాత్రమే ఆధారపడాలి. ఈ ఉద్యమం దేవుని ద్వారా, దేవుని మహిమ కొరకు నెలకొన్నదని వారి విశ్వాసం, కాబట్టి దీనికి పరిచారకులను, డబ్బును, ఇతర అవసరాలను దేవుడే సమకూర్చుతాడని గట్టిగా విశ్వసించారు. ఈ పాలసీనే నేటికీ యుఇయస్ఐని సజీవంగా ఉంచింది.

## దర్శనము - విలువలు

*సౌవార్తీకరణకు ముందు పరిశుద్ధత వస్తుంది*
*బోధించడానికి ముందు అనుసరించడం వస్తుంది*
*విజయానికి ముందు నమ్మకత్వం వస్తుంది*
*– జాన్ మార్టిన్*

దైవదర్శనం నిజమైన, వాక్యానుసారమైన విలువలను నిర్దేశిస్తుంది. ఇలాంటి దర్శనం కలిగిన జీవితం గొప్ప విలువలతో కూడినదై, మాదిరికరమైనదిగా ఉంటుంది. మన పితరులైన శ్రీమతి మరియు శ్రీ. ఇనాక్, నార్టన్ టి. స్టెరెట్, వారి సతీమణి, పి.టి. చాందపిళ్ళ, పొన్నురాజ్, జాన్ మార్టిన్, పి. సి. వర్గీస్, పి. సత్ కీర్తిరావు, దీనబంధు, దేవపాల్ గార్ల జీవితాలు ఎంతో సవాలుతో కూడుకున్నవి. వారి బోధల కంటే వారి జీవితాల నుండి ఇ.యు. విద్యార్థులు, యౌవన గ్రాడ్యుయేట్‌లు ఎన్నో విషయాలు నేర్చుకొన్నారు.

1975 లో జాన్ మార్టిన్ గారు, నలుగురు యౌవ్వన గ్రాడ్యుయేట్లతో హై ఫీల్డ్ నుండి కోయంబత్తూర్‌కు వెళుతున్నప్పుడు మార్గం మధ్యలో ఒక సహోదరుడు వాంతి చేసుకొన్నాడు. దాన్ని జాన్ మార్టిన్ గారు చేతితో శుభ్రం చేశాడు. మరొక సారి చాలా తల నొప్పితో బాధ పడుతున్న ఒక గ్రాడ్యుయేట్‌కి సీనియర్ గ్రాడ్యుయేట్ అయిన దీనబంధు గారు

అతను నిద్రపోయేవరకు తల నిమురుతూ ఉన్నారు. ఇప్పుడు మనము నేర్చుకొంటున్న 'మౌళిక విలువలు' అన్నీ వారి జీవితాలలో భాగమే. వ్యక్తిగత శ్రద్ధ, మౌన ధ్యాన సమయం, ప్రార్ధనా జీవితం, వాక్య ధ్యానం, విశ్వాస జీవితం, తెరువబడిన గృహాలు, మెంటరింగ్, కౌన్సిలింగ్, సామాన్య జీవితం, సేవకతత్వం వంటి లక్షణాలు వారి జీవితాలనుండి అందిపుచ్చుకొన్నవే. చక్కని రోల్ మోడల్స్‌గా వారు మన ముందు నిలిచారు. పదవులకు కాక వ్యక్తులకు ప్రాధాన్యత నిచ్చేవారు. ఈ తరంలో దర్శనం ఉంది కానీ విలువలు ఆశించినంతగా లేవు. కొందరు ఈ విలువలు కలిగి ఉండడానికి పెనుగులాడుతున్నారు. ఇది స్వాగతించాల్సిన పరిణామమే. పరిశుద్ధ జీవితం కోసం, ఈ మౌళిక విలువలు పెంపొందించుకోవాలనే ఆశతో, ప్రార్థనతో ప్రభువు సన్నిధిలో పెనుగులాడితే ఖచ్చితంగా ఆ విలువైన జీవితాన్ని ప్రతి ఒక్కరు పొందుకోగలరు. మనము పరిశుద్ధులగుటయే దేవుని చిత్తమైనప్పుడు, అటువంటి తపన మనలో ఉన్నప్పుడు మంచి తండ్రి అయిన మన దేవుడు ఈ విలువలతో కూడిన జీవితాన్ని ఎందుకివ్వడు?

## దర్శనం - ఆచరణ

ప్రోగ్రామ్స్, ఆర్గనైజేషన్‌ల కంటే వ్యక్తులు విలువైన వారు. మన పితరులు వ్యక్తిగత శ్రద్ధ, వ్యక్తిగతంగా దేవునితో సహవాసం, వ్యక్తిగత సువార్త సేవలకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ప్రతి వ్యక్తి యుఇయస్ఐ ఉద్యమంలో ప్రాముఖ్యమైన భాగస్వామి అని చాందపిళ్ళ గారు అనేవారు. ఆస్తులకు ప్రాధాన్యత నిచ్చేవారు కాదు. 'కాన్‌స్టిట్యూషన్ ఈజ్ నెసెసరీ ఈవిల్' అని ఇనాక్ గారు అనేవారు. దేవుని వాక్యము మనకు ప్రమాణం. పరిమాణం కంటే నాణ్యత ముఖ్యం.

యుఇయస్ఐ ఏర్పాటు చేసిన మొట్ట మొదటి క్యాంపుకు నలుగురు విద్యార్థులే రావటం చూచి కొందరు నవ్వారట. కానీ ఆ నలుగురు గొప్ప దైవజనులై మంచి సేవ చేశారు. వారిలో ఒకరు రెవ. థియోడర్ విలియమ్స్, ఐఇయం వ్యవస్థాపకులలో ఒకరు. ఈ విషయం శ్రీమతి. స్టైరట్ గారు సిల్వర్ జూబ్లీలో పంచుకొన్నారు. స్టైరట్ గారు ఎప్పుడూ ఒక మాట అనేవారు "దేవుడు మనల్ని విజయం సాధించడానికి ఎప్పుడూ పిలువలేదు గానీ నమ్మకంగా ఉండడానికే పిలిచాడు. చిన్న విషయాల్లో నమ్మకంగా ఉండడం గొప్పవిషయం. దేవుని పనిని దేవుని మార్గంలో చేయడం దైవికం, దేవుని పనిని మానవ మార్గంలో చేయడం దయ్యాల పని". ఇతర సేవా దర్శనముల ను గౌరవిస్తూ విద్యార్థుల మధ్య పరిచర్యకు ఎక్కువ ప్రాధాన్యత నిచ్చేవారు. (గలతీ 2:8,9) అన్ని విధాలుగా, అన్ని స్థాయిలలో పదవులు ఉన్నా లేక పోయినా సేవను కొనసాగించేవారు. పదవులను ఎప్పుడూ వారి స్వప్రయోజనానికి వినియోగించలేదు.

వ్యక్తిగత జీవితంలోను, సేవలోను నాణ్యతకు ప్రాముఖ్యత నివ్వడమేకాకుండా, విశ్వాసంతో కార్యక్రమాలు జరిపేవారు. ప్రతి క్యాంపు లోటుతో మొదలై మిగులుతో ముగించబడేది. ప్రొ. ఇనాక్ గారు తన వ్యక్తిగత జీవితంలోని "ఫెయిత్ పాలసీ" ని ఉద్యమంలోనికి తీసుకొని వచ్చారు. వారు ఏమి బోధించేవారో దాని ప్రకారం జీవించేవారు. ఇనాక్ గారి చిన్నబిడ్డ వంటి నిష్కల్మషమైన విశ్వాసం వలన దేవుడు గొప్పగా ఆలోచించడానికి ఆయనను ప్రేరేపించాడు. మొట్టమొదటి యుఇయస్ఐ అధ్యక్షుడుగా ఉండమని ఆయనను కోరితే ఎంతో వినయంగా దాన్ని తిరస్కరించారు.

నార్టన్ స్టెరెట్ గారు హైఫీల్డ్ క్యాంపుకు ముందు లెట్రిన్లు తన చేతులతో శుభ్రపరిచారు. తనకు పితరుల నుండి సంక్రమించిన ఆస్తిని అమ్మి హైఫీల్డ్‌ను కొని, మనకు కానుకగా ఇచ్చారు. తెరువబడిన వారి గృహాలు ప్రేమతో నిండి ఉండేవి. ఒకసారి బ్ర. దీనబంధు ఇలా అన్నారు "ప్రొ.ఇనాక్ ప్రేమ, టియన్ స్టెరెట్ సేవకునిగా ఉండడం, పిటి చాందపిళ్ళ నిబద్ధత, తీవ్రత, జాన్ మార్టిన్ బైబిల్ వివరణ, పిసి వర్గీస్, సత్యకీర్తిరావుల త్యాగపూరిత సేవ చూసి నేను ఆశ్చర్యపోతున్నాను. అవి ఎప్పుడూ సవాలుతో కూడుకొన్నవి". గ్రాడ్యుయేట్స్ సేవకు వెన్నెముకగా నిలిచారు. వారి గృహాలలో లభించే సహవాసం, సహకారం ద్వారా చాలామంది ప్రోత్సహించబడ్డారు.



త్యాగ పూరితమైన వారి జీవితం, ప్రభువు సేవకు ఇవ్వడం, పాల్గొనడం ఇతరులకు ఒక గొప్ప సవాలుగా ఉండేది. ఐయఫ్ఇయస్ యుఇయస్ఐ పరిచర్య గురించి ఇలా చెప్పింది. "ప్రపంచంలోని అన్ని విద్యార్థి ఉద్యమాల కంటే విద్యార్థులను చేరుకోవడంలో యుఇయస్ఐ పరిచర్య ఒక రోల్ మోడల్‌గా ఉంది".

## ప్రారంభంలో పని చేసిన స్టాఫ్ జీవనశైలి

"నిజమైన సాక్షి మాటల ద్వారా కాదు చేతల ద్వారా చూపిస్తాడు" అని మెక్ డొనాల్డ్ అంటాడు. "యుఇయస్ఐలోని స్టాఫ్ కలిగి ఉన్న దర్శనం మనకు ఎప్పుడూ స్ఫూర్తినిస్తుంది. వారి కమిట్‌మెంట్, త్యాగం యుఇయస్ఐలో ప్రత్యేకమైనవి" అని బ్ర. దీనబంధు అంటారు.

ప్రారంభ సంవత్సరాలలో పనిచేసిన స్టాఫ్ జీవితవిధానం చాలా సింపుల్‌గా ఉండేది. ఎంత జీతం వస్తుందో, ఎప్పుడు వస్తుందో తెలియదు. త్యాగపూరితంగా పరిచర్య చేసేవారు. వారి అక్కరలను ఎవరికీ తెలియ జేసేవారు కాదు. రిజర్వేషన్‌లు లేని ప్రయాణాలు చేశారు. ఆహ్వానించేవారు, అతిథి మర్యాదలు చేసేవారు లేని పయనీరింగ్ పరిచర్య. ఒకసారి ప్రయాణపు ఖర్చులు లేక ప్రసవానికి పూనా వెళ్ళిన తన భార్యను చూడడానికి కూడా చాందపిళ్ళ గారు వెళ్ళలేక పోయారు. అలాంటి త్యాగ పూర్వక దర్శనం వారిది. జోసఫ్ అభిషేక రావ్ చనిపోయినప్పుడు అందరూ ఆవేదన చెందారు. నార్టన్ స్టెరట్ గారు చనిపోయినప్పుడు హైఫీల్డ్ మూగబోయింది. ఆ సమయంలో స్టాఫ్ కాన్ఫరెన్స్‌లో ఉన్న స్టాఫ్ అంతా ఒక గొలుసుగా ఏర్పడి ఆయనకు ఇష్టమైన 'అమేజింగ్ గ్రేస్ హౌ స్వీట్ ద సౌండ్' అనే పాట కన్నీళ్ళతో పాడి ఆయన జీవితానికై దేవునికి కృతజ్ఞతలు తెలియ జేశారు. స్టాఫ్ మధ్య ఇటువంటి ప్రేమానురాగాలు ఉండేవి.

## విలువైన వారసత్వాన్ని విడిచి వెళ్ళిన దర్శనం

మన పితరులు, దర్శనం యొక్క ప్రాముఖ్యతను ఎరిగిన వారై, వారి నాయకత్వానికి ఆ దర్శనాన్ని ఒక ప్రేరేపక శక్తిగా తమ జీవితాలలో, సేవలో ఉపయోగించుకొన్నారు. అంతేకాదు వారు దేవుని యొద్ద నుండి పొందిన ఈ దర్శనాన్ని సమర్థవంతంగా, సరియైన విధంగా ఇతరులకు అందజేశారు. మనం చనిపోవచ్చు కానీ మన ప్రయాస, విశ్వాసం రాబోవు తరాలకు మాదిరిగా, సవాలుగా ఉంటాయి. వారి



విలువలకు, సౌవార్తీకరణకు, ప్రాముఖ్యతలకు ప్రాతిపదిక, స్థిరమైన వారి దర్శనం. త్యాగ పూర్వకంగా వారు జీవించి, కొనసాగించిన ఈ దర్శనాన్ని మనం అందిపుచ్చుకొందామా? ఆయనను ప్రేమించి, ఈ దర్శనాన్ని కొనసాగించుదామా? రాశి పెరిగి వాసిలేని అనేక కార్యక్రమాలలో నిమగ్నమై మన విలువలు తరిగి పోతున్న ఈ తరుణంలో ఆ పరలోక దర్శనానికి అవిధేయులు కాక, పితరుల వారసత్వాన్ని కొనసాగిద్దాము.

– యం.యన్. రవికుమార్, నెల్లూరు



### యుఇయస్ఐ - విజన్

మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం.

### యుఇయస్ఐ - మిషన్

భారతీయ కళాశాల విద్యార్థులను సౌవార్తీకరించి, ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా తర్ఫీదు చేసి, వారు సంఘాన్ని, సమాజాన్ని సేవించే విధంగా వారిని తయారు చేయడానికి యుఇయస్ఐ కృషిచేస్తుంది.

# గురియొద్దకే పరిగెత్తుచున్నాను

## (ఫిలిప్పీ 3వ అధ్యాయం)

### నేపథ్యం

రోమా సామ్రాజ్యంలోని మాసిదోనియ ప్రాంతంలో పౌలు స్థాపించిన తొలి సంఘం ఫిలిప్పీ సంఘం. అప్పటికే పౌలు చెరసాలలో ఉన్నాడు. అతడి పట్ల సాటి క్రైస్తవుల వ్యతిరేకతను, ఫిలిప్పీ సంఘంలో కొంతమంది అబద్ధ బోధనలను ఖండిస్తూ ఈ పత్రిక రాస్తాడు.

క్రీస్తు నందు విశ్వాసంతో పాటు సున్నతి వంటి ధర్మశాస్త్ర సంబంధ నియమాలను కూడా పాటించాలని ఈ అబద్ధ బోధకులు బోధిస్తూ ఉండడాన్ని ఖండిస్తూ, దేని విషయమై పౌలు క్రీస్తు యేసు చేత పట్టబడ్డాడో, అతని గురి ఏమిటో తెలియజేస్తూ ఈ 3వ అధ్యాయాన్ని రాస్తాడు.

### ప్రశ్నలు

1. ఫిలిప్పీ సంఘంలో అబద్ధ బోధకులను పౌలు ఏమని సంబోధిస్తున్నాడు?
2. సంఘంలో వారు చేసే క్రియలు ఏంటి? అంతిమంగా వారి గురి ఏంటి? (3, 18 -20)
3. పౌలు తాను అతిశయించడానికి **గతంలో** తనకున్న ఆధిక్యతలేంటి? వాటిని వేటితో సమానంగా ఎంచుకుంటున్నాడు? ఎందుకై ఉంటుంది? (5-9)
4. ఒక ఇయు విద్యార్థిగా, ఇఐయఫ్ గ్రాడ్యుయేట్‌గా మనం వేటిని బట్టి అతిశయించే ప్రమాదముంది?
5. పౌలు క్రీస్తులో **ప్రస్తుతం** సంపాదించుకున్న ఆధిక్యతలేంటి? (10,11)
6. **భవిష్యత్తుకు** సంబంధించిన అతడి లక్ష్యం/గురి ఏమిటి? దానిని పొందుకోవడానికి అతడు ఎలా పాటుపడుతున్నాడు? (12-14)
7. ఇంత నాణ్యమైన ఆత్మీయ జీవితం కలిగియుండి, ఇంత గొప్ప పరిచర్య చేసి ఉండి కూడా పౌలు ఇంకా గురి యొద్దకు పరిగెడుతుండడాన్ని ఎలా సవాలుగా తీసుకోవచ్చు?
8. దేని నిమిత్తం మనం క్రీస్తు యేసు చేత పట్టబడ్డాము? ఇంకా మన ముందు ఉన్నవి ఏంటి?
9. "నన్ను పోలి నడుచుకొనుడి" అని పౌలు అంటున్న విధంగా నీ వెనుక ఉన్న ఇయు విద్యార్థికి/ఇఐయఫ్ గ్రాడ్యుయేట్‌కు నీవు మాదిరిగా ఉండగలుగుతున్నావా? ఉండలేకపోవడానికి కారణాలేంటి?
10. సిలువకు శత్రువులు ఎవరు? వారి లక్షణాలు ఏంటి? ఆ లక్షణాలు మనలో కూడా ఉన్నాయా?



పౌలు 'నేను దేని కొరకు పట్టబడ్డానో వాటిని పట్టుకొనవలెనని పరుగెత్తుచున్నాను..... గురి యొద్దకే పరుగెత్తుచున్నాను..' అంటున్నాడు. ఇది టీమ్‌గా ఆడే గేమ్‌తో పోల్చినట్లుగా లేదు. వ్యక్తిగతంగా ఆడే పరుగు పందెంతో పోల్చినట్లుగా కనిపిస్తుంది. కాబట్టి మన సహవాసాన్ని దేవుని శరీరంతో పోల్చుకుంటే అందులోని ప్రతి ఒక్కరం అవయవాలుగా మన మన బాధ్యతలను వ్యక్తిగతంగా గురి (గోల్స్) పెట్టుకొని నెరవేర్చవలసిన వారమై యున్నాము.

**- యస్. నిస్సీ లివింగ్ హోప్,** స్టాఫ్,
విజయవాడ

# దేవుని పిలుపు

## ఒక ఐదింతల ప్యాకేజీ

సాధారణంగా పెద్ద పెద్ద కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చే సమయంలో ప్యాకేజీని ఆఫర్ చేస్తాయి. జీవన భృతి, ఇంటి అద్దె అలవెన్స్, ప్రయాణ అలవెన్స్, పిల్లల ట్యూషన్ ఫీజు, ఆరోగ్య భీమా వంటివి ఆ ప్యాకేజీలో ఉంటాయి. ఎంపిక కాబడిన ఉద్యోగి చేయవలసినదల్లా ఒక్కటే. అదేమిటంటే ఆ కంపెనీ అభివృద్ధికి కష్టపడి పని చేయడమే. మిగతావన్నీ కంపెనీ చూసుకొంటుంది.

దేవుడు కూడా ఒక వ్యక్తిని పిలుచుకున్నప్పుడు ఆ పిలుపులో ఆ వ్యక్తి సాల్వేషన్ (Salvation), దేవుని దర్శనం (Vision), ప్రొవిజన్ (Provision), మిషన్ (Mission), దర్శన నెరవేర్పు అనే ఐదు అంశాలు ఇమిడి ఉంటాయి. ఈ ఐదింటిని కలిపి ఒకే ప్యాకేజీగా ఆయన ఆఫర్ చేస్తాడు. ఆయన పిలుపునందుకొని రక్షింపబడిన విశ్వాసి యొక్క ఏకైక లక్ష్యం – ఆయన పోలికగా బ్రతుకుతూ ఆయన రాజ్య వ్యాప్తి కొరకు కష్టపడి పనిచేయడమే. మిషన్ వలననే విజన్ నెరవేరుతుంది.

బైబిలులో దేవుడు పిలుచుకున్న ఏ వ్యక్తి పిలుపును పరిశీలించినా ఈ ఐదు అంశాలు ఒకే ప్యాకేజీగా ఇమిడి ఉండడం గమనించగలం. ఈ సందర్భంగా కొంతమంది భక్తుల జీవితాల్లో దేవుని పిలుపును పరిశీలిద్దాము.

### 1. అబ్రహాముకు దేవుని పిలుపు

ఆదికాండము 12వ అధ్యాయం మొదటి వచనములో దేవుడు విగ్రహారాధన కుటుంబం నుండి అతడిని పిలుచుకోవడం చూస్తాము. ఆ పిలుపులో ఈ ఐదింతలు ఇమిడి ఉండటం పరిశీలిద్దాం.

**ఎ. సాల్వేషన్:** అబ్రహాము దేవుని పిలుపుకు లోబడి ఆయనను విశ్వసించడాన్ని బట్టి అతడిని నీతిమంతుడిగా తీర్చి ఆశీర్వదిస్తాడు – ఆ. కాం 12:2 “ అతడు యెహోవాను నమ్మెను ఆయన అది అతనికి నీతిగా ఎంచెను” – ఆ. కాం 15:6

**బి. విజన్:** విజన్ అంటే భవిష్యత్తుకు సంబంధించినది.



దేవుడు అబ్రహాము ద్వారా ఆయనకు ఒక రాజ్యాన్ని ఏర్పరచుకోవాలని సంకల్పించాడు. అది ఆయన భారం. విజన్ అనేది పిలువబడినవానికి, పిలిచినవానికి ఇద్దరికీ ఉపయోగం. దేవుడు తన దర్శనాన్ని అబ్రహాముతో ఈ విధంగా పంచుకుంటున్నాడు “భూమి యొక్క సమస్త వంశములు నీ యందు ఆశీర్వదించబడును.” – ఆ. కాం 12:3 “ నీవు అనేక జనములకు తండ్రివగుదువు” – ఆ.కాం 17:4.

**సి. ప్రొవిజన్:** దేవుడు ఒక వ్యక్తితో పని (మిషన్) చేయించుకోవడానికి దానికి కావలసిన ప్రొవిజన్స్ ముందే కల్పిస్తాడు. అబ్రహాముకు దేవుడు ఈ విధంగా భరోసా ఇస్తున్నాడు. “అబ్రహామా భయపడకుము. నేను నీకు కేడెము. నీ బహుమానము అత్యధికమగును. నేను సర్వశక్తి గల దేవుడను” – ఆ. కాం 15:1; 17:1. దేవుడు కాపాడేవాడు, సామర్థ్యం ఇచ్చేవాడు, కార్యసిద్ధి కలుగ చేసేవాడు – ఫిలిప్పీ 2:13.

**డి. మిషన్:** మిషన్ అంటే ఇప్పటికి సంబంధించినది. అంటే విజన్ నెరవేర్పుకు ఏ పని చేయాలో ఆ పనిని ఖచ్చితంగా చేయడం. అబ్రహాము తన స్వదేశాన్ని

విడిచి దాదాపు 1690 కి.మీ. ప్రయాణం చేసి దేవుడు వెళ్ళమన్న కనాను దేశాన్ని చేరుతాడు – ఆ. కాం 12:4-6. "అబ్రహాము పిలువబడినప్పుడు విశ్వాసమును బట్టి ఆ పిలుపుకు లోబడి తాను స్వాస్థ్యముగా పొందనైయున్న ప్రదేశమునకు బయలు వెళ్లెను" – హెబ్రీ 11:8

**ఇ. విజన్ నెరవేర్పు:** అబ్రహాము సంతానం భౌతికంగా చాలా అభివృద్ధి చెందింది. అంతేకాదు ఆత్మీయంగా అబ్రహాము కుమారుడగు దావీదు కుమారుడైన యేసుక్రీస్తు నందు జనములు ఏ విధంగా ఆశీర్వదింపబడి దేవునికొక రాజ్యముగా విస్తరింపబడుతున్నారో మనం ఇప్పుడు చూడగలుగుతున్నాము.

## 2. మోషేకు దేవుని పిలుపు

దేవుడు మోషేను మొట్ట మొదటిగా పిలవడం నిర్గమ 3:4లో చూస్తాము. అతని పిలుపులో కూడా ఈ ఐదు అంశాలు ఇమిడి ఉన్నాయి.

**ఎ. సాల్వేషన్:** దేవుడు మోషేను పిలుచుకుని, రక్షించుకొని, ఇశ్రాయేలు ప్రజలకు అధికారిగాను, తీర్పరి గాను, ప్రవక్త గాను, విమోచకుని గాను నియమించుకొంటాడు – అ.కా 7:35,37

**బి. విజన్:** మండుచున్న పొదలోని అగ్నిజ్వాలల్లో దేవుడు అతడికి కనబడి ఐగుప్తు బానిసత్వపు కొలిమిలో తన ప్రజల నరకయాతనను సాదృశ్య రూపంగా తెలియచేస్తాడు. వారు ఆ కొలిమిలో మండుతున్నప్పటికీ దేవుని కాపుదలలో నశించి పోకుండా ఉండడాన్ని కూడా ఆ పొద తెలియజేస్తుంది. దేవుడు మోషేతో ఇలా అంటాడు – "ఐగుప్తు బాధలో నుండి పాలు తేనెలు ప్రవహించు దేశమునకు మిమ్మును రప్పించెదను" – నిర్గమ 3:17 "మోషే ఆ దర్శనాన్ని నిదానించి చూస్తాడు" – అ.కా 7:31,34

**సి. ప్రొవిజన్:** "నిశ్చయంగా నేను నీకు తోడైయుందును" – నిర్గమ: 3:12. మాట మాంద్యము గల మోషేకు తన అన్నయైన అహరోనును అతనికి నోరుగా నియమిస్తాడు. ఆయన బలాతిశయానికి సూచనగా ఒక కర్రను అతడికి అందచేస్తాడు – నిర్గమ: 4:16,17

**డి. మిషన్:** దేవుని పిలుపుకు లోబడి మోషే తన భార్య పిల్లలను తీసుకొని మిద్యానులో తన మామ ఇంటి నుండి దాదాపు 1127 కి.మీ. ప్రయాణం చేసి ఐగుప్తుకు తిరిగి వెళతాడు. ఇశ్రాయేలు ప్రజలను బానిసత్వపు కొలిమిలో నుండి బయటకు తెచ్చి, 40 సంవత్సరాలపాటు ప్రజల నుండి ఎంతో తిరుగుబాటు, ఎన్నో ఆటుపోట్లు, కష్టాలు, శ్రమలు భరించి చివరకు వాగ్దాన భూమియైన కనాను దేశపు సరిహద్దు వరకు వారిని చేర్చి, తన విజన్‌ను, మిషన్‌ను యెహోషువాకు అప్పగించి తుది శ్వాస విడుస్తాడు.

**ఇ. విజన్ నెరవేర్పు:** యెహోషువ నాయకత్వములో దేవుని ప్రజలు వాగ్దాన భూమిని ఏ విధంగా స్వతంత్రించుకున్నారో యెహోషువ గ్రంథములో స్పష్టంగా చూస్తాము.

## 3. పౌలుకు దేవుని పిలుపు

సంఘాన్ని హింసించే సౌలుగా ఉన్నప్పుడు ప్రభువు అతడిని సౌలా సౌలా అని పిలవడం అ.కా 9:4 లో చూస్తాము. ఈ పిలుపులో కూడా ఐదింతల ప్యాకేజీ చూడగలం.

**ఎ. సాల్వేషన్:** అ.కా22:16 ప్రకారం పౌలు తడవు చేయకుండా లేచి క్రీస్తు నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది తన పాపములను కడిగి వేసుకుంటాడు.

**బి. విజన్:** నశించి పోతున్న ప్రజలు రాబోవు దినాల్లో ఎలా మార్పు పొందబోతున్నారో దేవుడు పౌలుకు చూపిస్తున్నాడు. "వారు చీకటిలో నుండి వెలుగులోనికిని, సాతాను అధికారము నుండి దేవుని వైపుకును తిరిగి, నాయందలి విశ్వాసము చేత పాప క్షమాపణను, పరిశుద్ధ పరచబడిన వారిలో స్వాస్థ్యమును పొందుదురు" – అ. కా 26:18

**సి. ప్రొవిజన్:** పౌలుకు ప్రభువు ఈ విధంగా భరోసా ఇస్తున్నాడు."నేను ఈ ప్రజల వలనను, అన్యజనుల వలనను హాని కలుగకుండా నిన్ను కాపాడెదను"– అ. కా 26:17. అంతేకాదు దేవుడు అతడికి వాక్యపరంగా విశేషమైన పాండిత్యాన్ని, ఆత్మ నడిపింపును అనుగ్రహిస్తాడు. అనేకసార్లు అనేక విధాలుగా ప్రమాదాల నుండి, విపత్తుల నుండి, ప్రాణహాని నుండి కాపాడుతాడు.

**డి. మిషన్:** అతడు ఎక్కడెక్కడ పరిచర్య చేసాడో అంతటిని ఒక్క మాటలో అగ్రిప్ప రాజుతో చెప్తాడు. "మొదట దమస్కులోని వారికిని, యెరుషలేములోనూ, యూదయ దేశమంతటను, తరువాత అన్యజనులకును

సువార్త ప్రకటించుచుంటిని" - అ. కా 26:20. అపోస్తలుల గ్రంథమును, అతడు రాసిన పత్రికలను చదువుతున్నప్పుడు సువార్త ప్రకటించడం కొరకు అతడు ఎన్ని కష్టాలు పడ్డాడో, ఎంత త్యాగపూరితంగా ప్రయాసపడ్డాడో మనకు అర్థమవుతుంది.

**ఇ. విజన్ నెరవేర్పు:** పైన పేర్కొన్న పుస్తకాలను చదువుతున్నప్పుడు అతడు మూడు సువార్త దండయాత్రలు చేస్తూ క్రీస్తును ప్రకటించడం మూలంగా ఎంతమంది దేవుని వైపుకు తిరిగారో, ఎన్ని సంఘాలు కట్టబడ్డాయో, దేవుని రాజ్యం ఏ విధంగా విస్తరించబడిందో మనం చూడగలం."ఇంక నేను సువార్త ప్రకటించవలసిన ప్రాంతాలు లేవు" అంటాడు ఒకచోట.

## 4. మన పితరులకు దేవుని పిలుపు

**ఎ. సాల్వేషన్:** మన పితరుడైన ప్రొఫెసర్ ఇనాక్ గారిని దేవుడు పిలుచుకొని రక్షించుకున్న వైనం "ఆయన అడుగుజాడల్లో" అనే పుస్తకములో పొందు పరచబడింది.

**బి. విజన్:** దేవుడు ఆయనకు అందించిన విజన్ ఈ విధంగా ఉంది - "మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం" అప్పటికి ఇది భవిష్యత్తు. ఇప్పటికీ ఇది భవిష్యత్తే.

**సి. ప్రొవిజన్:** 1954 నుండి దేవుడు ఎంతో మంది విద్యార్థులను, గ్రాడ్యుయేట్లను, స్టాఫ్ ను తలాంతులతో, నైపుణ్యాలతో, వాక్యపు పరిపుష్టితో నింపి విద్యార్థి లోకంలో వాడుకుంటూ ఆర్గనైజేషన్‌ని కాపాడుతూ ఇప్పటి వరకు పదిలపరుస్తూ వస్తున్నాడు.

**డి. మిషన్:** యుఇయస్ఐ తనకు దేవుడు అందించిన దర్శనాన్ని నెరవేర్చే ప్రక్రియలో ఈ విధంగా ప్రయాస పడుతుంది - "భారత దేశంలోని కళాశాల విద్యార్థులను క్రీస్తు సువార్తతో సంధించి వారిని సంఘమునకు మరియు సమాజమునకు సేవ చేయు యేసుక్రీస్తు ప్రభువు శిష్యులుగా తర్ఫీదుచేయుటయే"

**ఇ. విజన్ నెరవేర్పు:** ఒక చిన్న బైబిల్ స్టడీ సెల్ లాగా ప్రారంభించబడిన ఈ ఉద్యమం ద్వారా ఎంతమంది విద్యార్థులు రక్షింపబడి, శిష్యులుగా మార్చబడి, నాయకులుగా తర్ఫీదు పొంది, సహవాసానికి చేర్చబడుతూ తద్వారా భారతదేశ వ్యాప్తంగా యుఇయస్ఐ ఏ విధంగా విస్తరించబడిందో నేడు మనం చూడగలుగుతున్నాము.

ఈ విధంగా దేవుడు ఏ వ్యక్తిని పిలుచుకున్నా ఆ పిలుపులో ఈ ఐదు అంశాలు ఒకే ప్యాకేజీగా ఇమిడి ఉంటాయి. ఈ ఐదు అంశాలను ఏ భాగానికి ఆ భాగం విడగొట్టి చూడడానికి వీలు లేదు. రక్షింపబడిన ఏ వ్యక్తీ తనకు నచ్చిన అంశం దగ్గర కంఫర్ట్‌గా సెటిలైపోకూడదు.

ఈ ఐదింతల దేవుని పిలుపులో 80% దేవుడే చేస్తుంటాడు. మనం చేయాల్సిన మిషన్ 20 శాతమే. అందులోనూ మనం కొర్రీ పెడుతుంటాము.

దేవుని పిలుపు = సాల్వేషన్ + విజన్ + ప్రొవిజన్ + మిషన్ + విజన్ నెరవేర్పు

## ముగింపు

మన లక్ష్యాలలో మొదటిది ఇవాంజిలిజమ్. రెండవది ఫెలోషిప్. మన మిషన్‌లో ఇవాంజిలిజం చేయడం, ఫెలోషిప్ ద్వారా శిష్యులుగా, నాయకులుగా తయారు చేయడం జరుగుతుంటుంది. కేవలం ఫెలోషిప్‌కు, ప్రోగ్రాములకు హాజరైతే ఇవాంజిలిజం చేస్తున్నట్లు కాదు. ఇప్పటికే కొన్నిచోట్ల ఇవాంజిలిజంను రెండో స్థానానికి నెట్టి ఫెలోషిప్‌ను మొదటి స్థానానికి తేవడం జరిగిపోతుంది. దేవుడు మన పితరులకు ఇచ్చిన వరుస క్రమాన్ని రివర్స్ చేసి వ్యవస్థను అస్తవ్యస్తం చేయకూడదు. అలాచేస్తే ఇవాంజలిజం లేని, పనిలేని ఫెలోషిప్‌లు మిగులుతాయి.

ప్రభువును పూర్ణహృదయంతో ప్రేమిస్తూ, ఆయన చిత్త ప్రకారం జీవిస్తూ, నశించిపోతున్న వారిని ప్రేమించగలిగితేనే మన మిషన్ కోసం ప్రయాసపడగలం.

ఒక దైవజనుడు బాగా పరిశీలించి పరిచర్యకు సంబంధించి మూడు స్థితులు ఉంటాయని తేల్చి చెప్పాడు 1. మిషన్ లేని విజన్ ఒక కల మాత్రమే 2. విజన్ లేని మిషన్ కాలక్షేపం మాత్రమే 3. విజన్ తో కూడిన మిషన్ మాత్రమే ప్రపంచాన్ని మార్చగలదు అన్నాడు. సోదరుడా సోదరి నీవే స్థితిలో ఉన్నావు? పౌలు అంటాడు "కాబట్టి అగ్రిప్పరాజా ఆకాశము నుండి కలిగిన దర్శనమునకు నేను అవిధేయుడను కాను" (అ.కా 26:19) పౌలు వలె అలా చెప్పగలవా?

**- యస్. డేవిడ్ లివింగ్ స్టోన్,**
జంగారెడ్డిగూడెం

# నోవహు

## తన తరంలో నీతిమంతుడు

అంతరిక్ష కేంద్రం నుండి 8 రోజుల తర్వాత బయలు దేరాల్సిన సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌లు 286 రోజుల తర్వాత భూమిపై అడుగు పెట్టారు. వారు ప్రయాణించాల్సిన అంతరిక్ష నౌకలో సాంకేతిక సమస్యలు తలెత్తడం వల్ల సురక్షితంగా భూమికి చేరడానికి వేరొక నౌక కోసం 9 నెలలు అంతరిక్ష కేంద్రంలో వేచి చూస్తూ ఉండిపోయారు. నాసా అహర్నిశలు కష్టపడి,1200 కోట్లు ఖర్చుపెట్టి సునీత విలియమ్స్, బుచ్ విల్మోర్‌లను సురక్షితంగా భూమికి చేర్చారు.

దేవుడు కూడా మన యెడల అదే చేశాడు. పాడైపోయిన ఈ లోకంలో నుండి తన యందు విశ్వాసం ఉంచే వారిని రక్షించడానికి అంతర్జాతీయ ఓడను నిర్మించమని దేవుడు నోవహుకు ఆజ్ఞాపించాడు. దాదాపు 50 నుండి 60 సంవత్సరాలు ఆ ఓడ నిర్మాణం జరిగింది. జల ప్రళయం నుండి తప్పించుకుని సురక్షితంగా ఉండటానికి ఓడలోకి రమ్మని 120 సంవత్సరాలు నోవహు ప్రకటించాడు. మౌనంగా మూగజీవులు ఓడవైపు అడుగులు వేశాయి కానీ దేవుని స్వరూపంలో ఉన్న మనుష్యులు ఒక్క అడుగు వేయడానికి కూడా ఇష్టపడలేదు ఒక్క నోవహు కుటుంబం తప్ప.

నోవహు అంటే నెమ్మది అని అర్థం. నోవహు 950 సంవత్సరాలు బ్రతికాడు. తండ్రి పేరు లెమెకు. కుమారులపేర్లు షేము, హాము, యాపెతు. నోవహు నీతిపరుడు, నిందారహితుడుగా ఉన్నాడు. నోవహు దేవునితో కూడా నడిచిన వాడు, దేవుని యొక్క స్వరాన్ని విన్నవాడు. ప్రశ్నించని విధేయత కలిగి జీవించినవాడు. అందుకే విశ్వాసం ద్వారా లోకం మీద నేర స్థాపన చేశాడు. నోవహు నీతిని ప్రకటిస్తూ ఆ తరం వారిని హెచ్చరించాడు. కానీ వాళ్ళంతా నోవహు ప్రకటనను తృణీకరించారు, హేళన చేసి వెక్కిరించారు. దేవుని పద్ధతి కేవలం మనుష్యులను శిక్షించడం కాదు, వారి పాపాన్ని విడిచిపెట్టి సత్ప్రవర్తన కలిగి దేవుని వైపు తిరగాలి



అన్నది దేవుని యొక్క ప్రణాళిక. అందుకే సుదీర్ఘంగా వాళ్ళని ప్రేమించి హెచ్చరించాడు. “నరకపు అంచుల వరకు దేవుని ప్రేమ మనుషుల్ని వెంటాడుతుంది” అంటాడు ఒక భక్తుడు. దేవుడు మన యెడల తన ప్రేమని వెల్లడి పరుస్తున్నాడు ఎట్లనగా మనం ఇంకను పాపులమై ఉండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను (రోమా5:8).

### 1. నీతిమంతుడు

నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపుల్లో ఊహ అంతయు ఎల్లప్పుడూ కేవలం చెడ్డదని, నరులను చేసినందుకు దేవుడు సంతాపం నొంది హృదయంలో నొచ్చుకున్నాడు. మనుష్య కుమారుని యొక్క రాకడ నోవహు దినములలో ఉన్నట్లు ఉంటుంది. ప్రజలు తినుచు, త్రాగుచు పెళ్ళాడుచు పెండ్లికి ఇచ్చుచుంటారని ప్రభువు అన్నాడు. అంటే విచ్చలవిడిగా అనైతికంగా బ్రతికే సమాజం. అలాంటి తరంలో నోవహు ఒక్కడే నీతిమంతుడిగా నిందా రహితుడిగా జీవించాడు. అలాంటి భ్రష్టత్వం కలిగిన లోకంలో మనం కూడా జీవిస్తున్నాం. నోవహు ఎదుర్కొన్న సవాళ్ళే నేడు మనం కూడా ఎదుర్కొంటున్నాం.

- వివాహ బంధాలకి విలువ లేని తరంలో మనం ఉంటున్నాము. భార్యాభర్తల మధ్య ఉండేది శరీర సంబంధం తప్ప మరేమీ కాదు అని వివాహాన్ని నిషేధిస్తూ సహజీవనానికి ఈ తరం మొగ్గు చూపుతుంది.
- డ్రగ్స్, పోర్నోగ్రఫీ,మద్యంతో కళాశాలలు నిండిపోయాయి.

- అశ్లీలతే కేంద్రంగా సాగుతున్న సినిమాలు, టివి షోలు.
- పెళ్ళికి ముందు ఇద్దరూ ఇష్టపడి శారీరకంగా కలవడం అనేది తప్పు కాదు అంటున్న తరంలో, నైతికంగా దిగజారిపోయిన సమాజంలో మనం ఉన్నాం.
- LGBTQIA+ని ప్రోత్సహించే వ్యక్తులు, సమాజాలు,
- డార్క్ కామెడీతో హద్దులు మీరి పోతున్న హాస్యం.
- కులం మతం ప్రాంతాలుగా వేరైపోయి ఒకరి నొకరు హింసించుకునే సమాజం.

ఇలాంటి తరంలో నోవహు లాంటి నీతిమంతుల కోసం ప్రభువు ఎదురు చూస్తున్నాడు.

## 2. విధేయత

నోవహు దేవునితో నడిచాడు. అబ్రహాము, మోషే వలె నోవహు దేవునితో మాట్లాడినట్లు కనిపించదు. ఎల్లప్పుడు దేవుని మాటలు వినేవాడు. కేవలం వినడం మాత్రమే కాదు దేవుడు చెప్పినది ఎంత కష్టమైన పని అయినా దానిని సంపూర్ణంగా చేశాడు. ఓడకి ఎలాంటి కొలతలు ఉండాలి? లోపల ఎలాంటి అమరిక ఉండాలి? ఓడ తలుపు కిటికీలు ఎక్కడ ఉండాలి? ఎలా ఉండాలి? అని దేవుడు చెప్పిన ప్రతి పని నోవహు చేశాడు. దేవుడు మనుషులకు అప్పగించిన పనులలో బహుశా ఓడ నిర్మించడమే అతిక్లిష్టమైన, కష్టమైన పని అయి ఉండవచ్చు. ఒక సైనికుడు తన్ను దండులో చేర్చుకున్న ఒక సైన్యాధిపతి ఆదేశాలకు ఏ విధంగా విధేయత చూపిస్తాడో అలాంటి ప్రశ్నించని విధేయత కలిగిన వాడు నోవహు.

## 3. విశ్వాసం

నోవహు విధేయత చూపించడానికి కారణం విశ్వాసం. ఒకవేళ దేవుడు ఇలాంటి గొప్ప ఓడని నిర్మించమని మనల్ని ఆజ్ఞాపిస్తే మనం ఎన్నో ప్రశ్నలు అనుమానాలు లేవనెత్తే వాళ్ళం. జల ప్రళయం అంటే ఏంటి? ఎప్పుడూ చూడలేదే! ఈ జంతువులను పక్షులను ఎలా పోషించాలి? ఎలా సంరక్షించాలి? నాకు జంతువులను, పక్షులను పోషించడం రాదు, అంత భారీ ఓడ నిర్మాణానికి కావలసిన పనిముట్లు నా దగ్గర లేవు, మా కుటుంబం అంతా ఈ పనిలో ఉంటే మాకు పోషణ ఎలా? మా ఎనిమిది మందితో ఈ ఓడ నిర్మాణం సాధ్యం కాదు. నువ్వు చెప్పినట్లు తలుపు పెడితే ఎలా మూస్తారు? ఈ తలుపు విషయంలో నీ ఆలోచన బాగాలేదు అనేవాళ్ళం. దేవుడు చెప్పిన ఆ జలప్రళయం రావడానికి 120 సంవత్సరాలు పట్టింది. అప్పటి వరకు నోవహు ఎంతో గొప్ప విశ్వాసంతో ఎదురు చూశాడు. అప్పటి వరకు లోకం నోవహుని, నోవహు కుటుంబాన్ని పిచ్చివాళ్ళలాగా, మతిస్థిమితం లేని పనులు చేసే మనుషుల్లా చూసి, మాటలతో అవమానించి ఉంటుంది. ప్రజలను నమ్మించడానికి ఆధారాలను, సూచనలను చూపించడానికి నోవహు ఏ మాత్రం ప్రయత్నించలేదు కాని "దేవుని మాట ఒక్కటే చాలు విధేయత చూపించడానికి" అనే గొప్ప విశ్వాసం కలిగి ఉన్నాడు.

## 4. దర్శనం

దేవుడు నోవహుకు ఇచ్చిన దర్శనం జలప్రళయం నుండి తమను కాపాడుకోవడానికి ఓడను నిర్మించమన్నాడు. దేవుడు ఇచ్చిన కొలతల ప్రకారం ఒక భారీ ఓడను నిర్మించడానికి నోవహు సిద్ధపడ్డాడు.

నాయకులుగా మన దర్శనం మనకు తెలిసి ఉండాలి. మన దర్శనంపై స్పష్టమైన అవగాహన ఉండాలి. ఆ దర్శనం కోసం ఒక ప్రణాళిక కలిగి, పట్టుదలతో పనికి సిద్ధపడాలి. దర్శనం మనల్ని దేవుని ఉద్దేశాలు నెరవేర్చడానికి మాత్రమే పరిమితం చేస్తుంది. దర్శనం మనల్ని సంపూర్ణ సామర్థ్యం కలిగి పనిచేసేలా చేస్తుంది. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికి దర్శనం మనకి ధైర్యాన్ని ఓర్పుని ఇస్తుంది. దర్శనం లేకుండా ఉన్న వ్యక్తులు అడ్డంకులు ఎదుర్కొనేటప్పుడు వారు నిరాశ చెందుతారు, ఆ పనిని విడిచి వెళ్ళిపోతారు. కానీ దర్శనం కలిగిన వారు ఎలాంటి అడ్డంకులు ఉన్నా ధైర్యంగా ముందుకు సాగిపోతారు.

భ్రష్టత్వంతో నిండిపోయిన లోకాన్నంతా మహా జల ప్రళయం ద్వారా నిర్మూలించి ఒక సరికొత్త లోకాన్ని పున:నిర్మించాలని అనుకున్నాడు దేవుడు. అందుకు విశ్వాసం, విధేయత, దర్శనం కలిగిన నోవహుని దేవుడు వాడుకున్నాడు. మనల్ని కూడా దేవుడు ఆయన రాజ్య నిర్మాణం కోసం విశ్వాసం, విధేయత, దర్శనం కలిగి ఉండాలని కోరుకుంటున్నాడు. మనం అలా ఉండడానికి సిద్ధమేనా?

– **టి. మధుబాబు,** స్టాఫ్, కర్నూలు

# దేవుడు నమ్మదగినవాడు



నా పేరు రవికుమార్ అనంతపూర్ జిల్లా గుత్తి మండలం, గాంధీనగర్ అనే ఒక చిన్న గ్రామం మాది. నాకు ఒక తమ్ముడు ఉన్నాడు. నాన్న స్కూల్లో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తారు. నేను బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ ఉన్నప్పుడు ఒక ఇవాంజిలిస్టిక్ క్యాంప్‌లో దేవున్ని తెలుసుకోవడం ద్వారా ఇయు పరిచయం అయ్యింది. ఇయులో బైబిల్ స్టడీస్, క్యాంప్స్, మైక్రో ప్రేయర్ సెల్స్ ద్వారా దేవుని గురించి అనేక విషయాలు తెలుసుకోవడానికి దేవుడు సహాయం చేశారు. నేను కాలేజీలో చదువుతున్న సమయంలో అనేక శోధనల ద్వారా, తెలిసి చేసిన పాపాల ద్వారా చాలా కోల్పోవడం జరిగింది. విశ్వాస జీవితం తొలి రోజుల్లో అప్పటి స్టాఫ్ కట్టా రవి కుమార్ అన్న, సీనియర్ అన్న వాళ్ళు నన్ను ప్రేమతో హెచ్చరిస్తూ చక్కగా గైడ్ చేశారు.

చదువు ముగించుకొని ఇంటికి వచ్చిన తర్వాత మా ఫ్యామిలీలో ఉండే ఫైనాన్షియల్ కండిషన్స్ చూసినప్పుడు నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. చాలా గడ్డు పరిస్థితిలో బెంగళూరులోని ఒక కంపెనీలో జాబ్ జాయిన్ అయ్యాను, అక్కడ జాబ్ చేస్తున్నప్పుడు నాకు కొన్ని అనారోగ్య సమస్యలు రావడంతో జాబ్ మానేశాను. ఆ టైమ్‌లో బ్యాంక్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవ్వాలని నేను ప్రేయర్ చేసుకొంటూ ఉన్నాను. అప్పుడు నా మనసులో ఒక ఆలోచన పుట్టింది. నేను ఎక్కడైతే దేవున్ని తెలుసుకున్నానో అక్కడ జాబ్ సంపాదించి దేవుని కోసం పని చేయాలనే ఆశ కలిగింది. అక్కడ ఒక బ్యాంక్ హెడ్ క్వార్టర్స్ ఉంటుంది. నేను ఈ జాబ్ తెచ్చుకుంటే ఇక్కడ దగ్గర్లో పోస్టింగ్ వస్తుంది. అప్పుడు నేను ఇక్కడే ఉండి పరిచర్య చేయవచ్చు అనుకున్నాను. కానీ ఆర్థిక పరిస్థితుల రీత్యా కోచింగ్‌కి సిటీకి వెళ్ళలేక అనంతపూర్‌లో జాయిన్ అయ్యాను. ఆ టైంలో నా మనసులో ఒకవైపు ఎంతో ఆవేదన, ఫైనాన్షియల్ ప్రాబ్లమ్స్, మరోవైపు సరైన అవగాహన లేకపోవడం, బయటి ప్లేస్‌కి వెళ్ళి జాబ్ చేసే ధైర్యం లేక అనేక భయాలు, అనుమానాల మధ్య నేను సతమతమవుతూ ఉన్నప్పుడు అనంతపురంలో ఉన్న ఇజియఫ్ అన్న వాళ్ళు చాలా ధైర్యం చెప్పారు. దేవుడు సహాయం చేస్తాడని నన్ను చక్కగా ప్రోత్సహించారు.

అనేక భయాలతో ఫస్ట్ ఇయర్లో ఒక్క ప్రిలిమినరీ ఎగ్జామ్ కూడా క్వాలిఫై అవ్వలేదు, ఒకవైపు ఇంట్లో వాళ్ళు నా మీద పెట్టుకొన్న నమ్మకం, మరో వైపు నా బలహీనతలు, భయాల నడుమ అప్పుడు చాలా ఇబ్బంది పడ్డాను. నేను ఉన్న హాస్టల్ నుండి మా కోచింగ్ సెంటర్‌కి వెళ్ళే దారిలో ఒక చర్చి ఉంది. అక్కడ గోడమీద ఉన్న ఒక మాట నన్ను ఎంతగానో బలపరిచింది.“దేనిని గూర్చి చింతపడకుడి కానీ ప్రతి విషయంలోనూ ప్రార్థన విజ్ఞాపన చేత కృతజ్ఞతాపూర్వకంగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి” (ఫిలిప్పీ 4:6). ఈ మాట దేవునిని ఎక్కువగా నమ్మడానికి, ఆయనవైపు చూడటానికి, ఆధారపడటానికి ఎంతో ఉపయోగపడింది. అలాగే, ఈ మాట నన్ను అనేక ఫెయిల్యూర్స్‌ని, బంధువుల నుండి ఫ్రెండ్స్ నుండి వచ్చే అపోజిషన్స్‌ను ధైర్యంగా ఎదుర్కోవడానికి సహాయపడింది. ఇక బైబిల్ స్టడీస్ ద్వారా, మెంటార్ అన్న ఫ్యామిలీ ద్వారా అనేక విషయాలు నేర్చుకొంటున్నప్పుడు మరలా అనేక ఫెయిల్యూర్స్ ఫేస్ చేయడం జరిగింది. ఎగ్జామ్ రాసిన ప్రతిసారి ప్రిలిమ్స్ ఎగ్జామ్ క్వాలిఫై అవ్వడం, మెయిన్స్ క్వాలిఫై అవ్వడం ఫైనల్ మెరిట్ లిస్టులో వెనుతిరగడం, ఇలా చాలాసార్లు 1.5, 2 మార్కులతో ఫెయిల్ అవ్వడం జరిగింది. అటువంటి టైంలో నేను చాలా డిప్రెషన్ లోనికి వెళ్ళిపోయాను. ఎవరితో మాట్లాడటానికి ఇష్టం ఉండేది కాదు. ఫ్యామిలీ గుర్తు వస్తున్నప్పుడల్లా చాలా ఏడుపు వచ్చేది. ఆ టైంలో నేను మరలా ఫిలిప్పీ 4:6 మాటను పట్టుకొని దగ్గర్లో ఉన్న క్యాంపస్‌లోని గ్రౌండ్‌లో నడుచుకుంటూ గట్టిగా ప్రార్థన చేసేవాణ్ణి.

ఆ టైంలో నాకు దగ్గరగా ఉన్న ఒక అన్న

నన్ను గమనిస్తూ "పీజీ స్టడీస్‌కి వెళ్తే బాగుంటుంది తమ్ముడూ ప్రేయర్ చేసుకో" అన్నారు. నేనేమో బీటెక్ బ్యాగ్రౌండ్ కాబట్టి గేట్ ఎగ్జామ్ రాసి ర్యాంకు వస్తే స్టైఫండ్ వస్తుంది. అప్పుడు ఇంట్లో వాళ్ళకు నేను భారంగా ఉండకూడదు, నాకు సహాయం చేయండి ప్రభువా అని ప్రేయర్ చేసుకునే వాడిని. అప్పుడు గైడ్ చేస్తున్న అన్నకి నేను ఈ మాట చెప్పలేక ప్రేయర్ చేసుకునేవాడిని. దేవుడు నా మనసులో పెట్టిన ఆశను బట్టి ప్రేయర్ చేసుకొంటూ సహాయం చేయండి ప్రభువా అని ఒంటరిగానే బాధపడేవాడిని. ఆ సమయంలో అమ్మా నాన్న నాకు బాగా సపోర్ట్ చేశారు.

ఆ సమయంలో నన్ను గైడ్ చేస్తున్న అన్న స్టడీస్ గురించి ఆలోచిస్తున్నావా? ప్రేయర్ చేసుకుంటున్నావా? అని అడుగుతూ వచ్చారు. నాకయితే పీజీకి వెళ్ళడం ఇష్టం లేదు, ఒకవైపు దేవుడు పీజీ స్టడీస్ పట్ల నాకు పాజిటివ్ యాటిట్యూడ్ ఇస్తున్నారు. నేను ప్రిపేర్ అవుతున్న బ్యాంక్ ఎగ్జామ్స్‌లో స్పెషల్ ఆఫీసర్ అనే వేకెన్సీస్ ఉండడం నేను గమనించాను. దానికి యంబిఏ క్వాలిఫికేషన్ కావాలని నాకు అర్థమైంది. ఆ టైంలో నేను మూడు సార్లు పీజీ ఎంట్రన్స్ ఎగ్జామ్ రాసి ఫైనల్‌గా జాయిన్ అవ్వకుండా ఆగిపోవడం, భయంతో వద్దు నావల్ల కాదు ఇంటి దగ్గర అమ్మా నాన్న ఏమంటారో అని, డబ్బులు కూడా లేవు, వయస్సు కూడా ఎక్కువ అవుతుంది ప్లీజ్ వద్దు ప్రభువా హెల్ప్ చేయండి అని అడిగేవాడిని. కానీ దేవుడు పీజీ స్టడీస్ చేయడానికి సహాయం చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో యంబిఏలో చేరాను. ఈ సమయంలో దేవుని వాక్యాన్ని అర్థం చేసుకునే విషయంలో, క్రైస్తవ సిద్ధాంతాలు నేర్చుకోవడానికి, కమ్యూనికేషన్ స్కిల్స్‌ని ఇంప్రూవ్ చేసుకోవడానికి, తెలియని విషయాలు తెలుసుకోవడానికి, సంబంధాలు పెంపొందించుకోవడానికి, ఫ్రీగా నాకున్న ఒపీనియన్స్ షేర్ చేసుకోవటానికి, ధైర్యంగా చేసిన తప్పును ఒప్పుకొని సరి చేసుకోవడానికి, యధార్థంగా జీవించడానికి, ఫ్యామిలీ యొక్క ప్రాధాన్యత తెలుసుకోవడానికి, దేవుని కోసం కంఫర్ట్స్ వదిలి కష్టపడాలని ఎన్నో విషయాలు నేర్చుకొన్నాను.

నేను చాలా సివియర్ హెల్త్ ప్రాబ్లంతో సఫర్ అయినప్పుడు మా జోన్లో ఉన్న ఫ్యామిలీస్ అన్నీ నా పట్ల చూపించిన దేవుని ప్రేమను బట్టి, వారు నన్ను చూసుకున్న విధానం నన్ను దేవునికి మరింత దగ్గరగా చేశాయి.

నా స్టడీస్ కంప్లీట్ చేసుకుని మరలా నేటివ్ ప్లేస్‌కి వచ్చాను. మరలా ఎగ్జామ్స్ రాయడం ఇలా సుమారుగా 8 ఇంటర్వ్యూస్ కి వెళ్ళటానికి దేవుడు సహాయం చేశారు. వాటితో పాటు 50 ఎగ్జామ్స్ రాయటానికి దేవుడు సహాయం చేశారు మరలా అదే ఫెయిల్యూర్.

మరలా ఇజియఫ్ అన్న వాళ్ళు, నన్ను గైడ్ చేస్తున్న అన్న ఫ్యామిలీ, స్టాఫ్ జక్కయ్య అన్న ఫ్యామిలీ, కోబిలీవర్స్ అందరూ "తమ్ముడూ నువ్వు ఒక ఆరు నెలలు ఇంకా కొంచెం సీరియస్‌గా చదువు, ఎక్కువ సమయం స్టడీస్‌కి కేటాయించాలని, వీలైతే నంద్యాల కు వెళ్లి చదువుకో, దేవుడు సాయం చేస్తారు" అని నన్ను ఎంకరేజ్ చేస్తూ వచ్చారు. నాకు మాత్రం వెళ్ళటం అసలు ఇష్టం లేదు. కొత్త ప్లేస్‌కి వెళ్తే మరలా అక్కడ కొత్త పరిస్థితులు, కొత్త వ్యక్తులు అడ్జస్ట్ అవడం కష్టం ప్రభువా ప్లీజ్ నాకు హెల్ప్ చేయండి అని మరలా ఫిలిప్పీ 4:6 అనే మాటలు పట్టుకుని అయిష్టంగానే నంద్యాలకి కోచింగ్ కోసం వెళ్ళాను. మనం ఒకటి అనుకుంటాం, కానీ దేవునికి మన పట్ల ఒక ఉద్దేశం ఉంటుంది.

నేను ఏదైతే వద్దు ప్రభువా నా వల్ల కాదని నాకు ఉన్న బలహీనతలను బట్టి భయపడ్డానో, అందులోనే దేవుడు తన కృపను బట్టి ఆ క్వాలిఫికేషన్ బేస్ చేసుకుని పంజాబ్ నేషనల్ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్‌గా జాబ్ ఇచ్చారు. మే నెలలో ఉద్యోగంలో జాయిన్ కావాలి. ట్రైనింగ్ ఇచ్చిన తర్వాత పోస్టింగ్ ఇస్తారు.

ఈ జర్నీ అంతట్లో దేవుని మీద ఆధారపడడానికి, ఆయన కార్యాలు నా పట్ల నేను రుచి చూచి ఎరగడానికి దేవుడు చేసిన సహాయాన్ని బట్టి మొదటిగా దేవునికి కృతజ్ఞతలు. ఈ ప్రాసెస్‌లో నన్ను భరించి, గైడ్ చేసిన, బ్యాంక్ కోచింగ్‌కి అవసరమైన ఆర్థిక సహకారం అందించిన అన్నలకు ధన్యవాదాలు. వాగ్దానం చేసిన దేవుడు నమ్మదగిన వాడని యెషయా 60:20 ప్రకారం 'యెహోవాయే నీకు నిత్యమైన వెలుగుగా ఉండును' వాగ్దానాన్ని క్లైమ్ చేసుకోవడానికి దేవుడు నా పట్ల కృప చూపించారు.

**– యం. రవి కుమార్,** నంద్యాల

హెచ్చరిక




# ఆన్‌లైన్ బెట్టింగ్స్

## డ్రగ్స్ కన్నా తీవ్రమైన సమస్య

బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న నితిన్ యథాలాపంగా బెడ్ మీద పడుకొని ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్‌ను స్క్రోల్ చేస్తూ ఉంటే ఒక ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ఆకర్షిస్తూ కనిపించింది. క్యాజువల్‌గా క్లిక్ చేసి చూశాడు. అందులో ఆసక్తి కలిగించేలా ఆ బెట్టింగ్ యాప్ ద్వారా ఈజీగా డబ్బు ఎలా సంపాదించవచ్చు అని పాపులర్ సినీ నటుడు ప్రమోట్ చేస్తున్నాడు. దానికి ఆకర్షితుడైన నితిన్ తన స్నేహితుడికి ఈ విషయాన్ని చెప్పాడు. ఆ ఫ్రెండ్ కూడా అప్పటికే అది వాడుతున్నానని చెప్పేసరికి నితిన్‌కి కూడా ఆ బెట్టింగ్ యాప్‌ని ఇన్స్టాల్ చేసుకోవాలన్న కోరిక మొదలైంది. ఆ యాప్‌ని వెంటనే గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్ళి ఇన్‌స్టాల్ చేసుకుని, వాడడం ప్రారంభించాడు. మొదట్లో కొంచెం కొంచెం డబ్బు పెట్టడం, లాభం రావడం గమనించాడు. ఆ ఊపుతో ఎక్కువ మొత్తంలో డబ్బు పెట్టడం ప్రారంభించాడు. కొద్ది రోజులకి డబ్బులు పోగొట్టుకోవడం ప్రారంభమైంది. అయితే నితిన్ అక్కడితో ఆగలేదు. అప్పు చేసి మరీ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో పెట్టడం ప్రారంభించాడు. అయినప్పటికీ ఆశించిన ఫలితం రావట్లేదు. ఆ అప్పులు తీర్చడానికి మరికొన్ని అప్పులు చేశాడు. ఎప్పుడో ఒకసారి పుంజుకొని లాభం వస్తుంది అనుకుంటూనే లక్షల అప్పుల ఊబిలో చిక్కుకున్నాడు. ల్యాప్‌టాప్, గోల్డ్ రింగ్, చైన్‌ను తాకట్టు పెట్టాడు. బయటికి రావటం ఎలాగో అర్థం కావట్లేదు, స్నేహితులకి తల్లిదండ్రులకు చెప్పాలంటే ధైర్యం సరిపోవట్లేదు. చదువుతున్నది బీటెక్ కానీ అప్పటికే కొన్ని లక్షల అప్పులు కొని తెచ్చుకున్నాడు. ఏం చేయాలో తెలియని పరిస్థితి. ఈ సమయంలో తన ముందు కనిపించిన పరిష్కారం ఆత్మహత్య. ఇక ఏమీ చేయలేని పరిస్థితిలో వేగంగా వస్తున్న ఒక ట్రైన్‌కు ఎదురుగా వెళ్ళి తన ప్రాణాన్ని వదులుకున్నాడు. నితిన్ కథ అర్థాంతరంగా ముగియడానికి కారణం ఆన్‌లైన్ బెట్టింగ్ అనే భూతం. ఇది కేవలం నితిన్ కథ మాత్రమే కాదు ఎంతోమంది విద్యార్థుల, యువకుల గాథ! అలాంటి ఆన్‌లైన్ బెట్టింగ్స్ గురించి, వాటి నుంచి ఎలా జాగ్రత్త పడాలో ఈ ఆర్టికల్‌లో మనం చూద్దాం.

### ఆన్‌లైన్ బెట్టింగ్స్ లక్ష్యం

సులభంగా, వేగంగా డబ్బు సంపాదించడం ఎలా? ఇది ప్రస్తుతపు విద్యార్థుల, యువకులను తొలిచేస్తున్న ఆలోచన. అలాంటి వారిని ట్రాప్ చేసుకొని సొమ్ము చేసుకోవడమే ఆన్‌లైన్ జూదం యొక్క ప్రధాన ఉద్దేశం. సర్వే ప్రకారం అత్యంత

వేగంగా ఆన్‌లైన్ బెట్టింగ్స్ పెరుగుతున్న దేశాలలో భారతదేశం కూడా ఒకటి. 16 నుంచి 18 ఏళ్లలోపు వారే ఎక్కువమంది ఆన్‌లైన్ బెట్టింగ్ బాధితులు ఉన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కి అలవాటు పడటానికి కారణాలు

ప్రస్తుతం విద్యార్థుల మధ్య, యువకుల మధ్య నడుస్తున్న ట్రెండ్ 'ఈజీ మనీ'. అంటే కష్టపడకుండా సులభంగా డబ్బు సంపాదించడం. తోటి ఫ్రెండ్స్ చాలా లగ్జరీగా, బ్రాండెడ్ వస్తువులతో కనిపించడం, వీళ్ళు కూడా వాళ్ళలాగా లగ్జరీగా ఉండాలను కోవడం, బ్రాండెడ్ వస్తువులు వాడాలనుకోవడం ద్వారా ఈజీ మనీ వైపు మొగ్గు చూపుతున్నారు. వారి కి ఉన్న సరదాలు, కోరికలు తీర్చుకోవటం కోసం ఈజీ మనీ వైపు చూస్తున్నారు. ఇలాంటి సందర్భాల్లో వారికి డిజిటల్ ప్లాట్ ఫామ్‌లో చూడడం ద్వారా, కొంతమంది ఫ్రెండ్స్ నుండి వినటం ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్స్, ఆన్‌లైన్ స్టూడెంట్ లోన్స్ వారి కి పరిచయం అవుతున్నాయి. సెలబ్రిటీల ద్వారా, క్రికెటర్ల ద్వారా, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ ద్వారా అవి ప్రమోట్ చేయబడడం మరికొంత ఉత్సాహాన్ని ఇస్తున్నాయి. ఆ బెట్టింగ్ గేమ్ ఇచ్చే థ్రిల్ కూడా కారణం. గెలిచినప్పుడు ఆనందంతో పాటు డోపమైన్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుంది. ఆ సంతృప్తి ఇంకా, ఇంకా కావాలనిపించడంతో అల వాటు కాస్త వ్యసనంగా మారుతుంది.

## బైబిల్ దృక్పథంలో ఆన్లైన్ బెట్టింగ్

ఆన్‌లైన్ బెట్టింగ్స్, గాంబ్లింగ్స్‌కు బైబిల్ వ్యతిరేకం. "ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" అని 1 తిమోతికి 6:10లో చూస్తాం. ఆన్‌లైన్ బెట్టింగ్స్, గాంబ్లింగ్స్ యొక్క మూలం డబ్బు ఆశ. బైబిల్ ధనాపేక్షను ఖండిస్తుంది. పౌలు థెస్సలొనీకయులకు రాసిన రెండో పత్రికలో ఇచ్చిన ఆజ్ఞ "మేము మీ యొద్ద ఉన్నప్పుడు–ఎవడైనను పనిచేయ నొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని మీకు ఆజ్ఞా పించితిమి గదా". పౌలు ఈజీ మనీని కోరుకునే వారిని, సంపాదించకుండా సుఖానుభవం కోరుకునే వారిని హెచ్చరిస్తున్నాడు. కష్టపడకుండా, మోసం చేత వచ్చే డబ్బు క్షీణించిపోతుంది, కష్టం చేసి

> ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది మాదకద్రవ్యాల (డ్రగ్స్) కన్నా తీవ్రమైన సమస్య, యువతకు వ్యసనంగా, దేశ భద్రతకు ముప్పుగా పరి ణమిస్తుంది. కాబట్టి ఆన్లైన్ బెట్టింగ్స్ విషయాలలో జాగ్రత్త పడుతూ, ఇతరులను జాగ్రత్త చేద్దాం!

సంపాదించుకున్న డబ్బు వృద్ధి చెందుతుంది అని సామెతలు 13:11లో చూస్తాం. బెట్టింగ్స్ (జూదం) అంటే దేవుడు ఇచ్చిన వనరులను సరిగా నిర్వహించకపోవడం (గృహ నిర్వాహకత్వం చేయకపోవడం), ఇది దురాశను, నిజాయితీగా పనిచేయకుండా ఉండటాన్ని ప్రోత్సహిస్తుంది. ఇతరుల నష్టంలో సంతోషిస్తుంది. ఒక క్రైస్తవునికి తగనిది. విశ్వాస విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా ఈ ఆన్‌లైన్ బెట్టింగ్స్, గాంబ్లింగ్స్ (జూదం)లో పాల్గొనకూడదు.

## ఆన్‌లైన్ బెట్టింగ్స్ నుండి ఎలా బయటపడాలి?

ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా ఆర్థిక సమస్యలు మొదలై, మానసికంగా కృంగిపోతాం. ఎంత నష్టం జరిగినా దానికి పరిష్కారం చావు మాత్రం కాదు. ఒకవేళ మనం ఇప్పటికే ఈ ఆన్‌లైన్ బెట్టింగ్స్ లో కూరుకుపోయి ఉంటే వాటి నుంచి బయట పడాల్సిన అవసరత ఎంతో ఉంది. అయితే ఎలా బయటపడాలి?

1. ముందుగా చేసిన తప్పును దేవుని దగ్గర ఒప్పుకోవాలి (గుర్తించాలి). పర్యవసనాలకు సిద్ధపడాలి.
2. ఇప్పుడు దశలవారీగా ముందుకు వెళ్ళాలి. మొదట చేయాల్సింది అలాంటి యాప్‌లు మీ ఫోన్ నుండి, కంప్యూటర్ నుండి తొలగించాలి. వాటికి సంబంధించిన నోటిఫికే షన్లు బ్లాక్ చేయాలి. ఇతరుల సహాయం కూడా తీసుకొని, మిమ్మల్ని అవి వాడకుండా ఉండేలా పర్యవేక్షించమని అడగాలి.

3. తల్లిదండ్రుల సహాయాన్ని కోరాలి. ఈ సమయంలో కుటుంబ సభ్యుల సహాయాన్ని కోరడం అత్యంత ప్రధానమైనది. వాళ్ళు ఈ విషయం తెలిసి తిట్టినా, కొట్టినా వారి కి ముందు ఈ విషయాన్ని తెలియజేయాలి. వాళ్ళు మన మంచే కోరుకుంటారు కాబట్టి వారికి తెలియజేసి, వారు ఇచ్చే సలహాలు తీసుకోండి.

4. కొద్దికొద్దిగా తీసుకున్న అప్పులు తీర్చడానికి ప్రయత్నం చేయండి. తీసుకున్న వారి దగ్గర గడువు తీసుకోండి.

5. సానుకూల దృష్టితో ముందుకు వెళ్ళండి. ఇకపై అలాంటి వాటికి దూరంగా ఉంటానని నిర్ణయం చేసుకోండి. ఇతర మంచి అలవాట్ల వైపు మొగ్గుచూపండి.

6. కౌన్సిలింగ్ అవసరమైతే తీసుకోండి. ప్రాణానికి మించి ఏదీ విలువైంది కాదు. కాబట్టి మీరు ఆలోచించ లేనప్పుడు, ఇజియఫ్ పెద్దలు, సైకియాట్రిస్ట్ సహాయం తీసుకోవచ్చు. అంతేగాని ఈ సమయంలో ఎలాంటి తప్పుడు నిర్ణయాలు చేయకూడదు. ఆత్మహత్య, దొంగతనాలు, తప్పుడు మార్గాల్లో వెళ్ళటం అసలు పరిష్కారం కాదని తెలుసుకోవాలి. మన తల్లిదండ్రుల గురించి, కుటుంబ సభ్యుల గురించి ఆలోచించాలి.

## ఆన్‌లైన్ బెట్టింగ్స్ నుండి ఎలా దూరంగా ఉండాలి?

ఆన్‌లైన్ బెట్టింగ్స్ వ్యసనంలో ఉన్న వారు మాత్రమే కాదు, సోషల్ మీడియాను తరచుగా ఉపయోగించేవారు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తున్నప్పుడు ఆకర్షణీయమైన విషయాలు కనిపిస్తాయి. మనలో లేని కోరికల్ని పుట్టిస్తాయి. కావున విశ్వాస విద్యార్థులుగా, గ్రాడ్యుయేట్స్‌గా మనం వాటి విషయంలో జాగ్రత్తలు వహించాలి. అలా ఆకర్షించే బెట్టింగ్ యాప్స్, స్టూడెంట్ లోన్స్, ఎంప్లాయ్ లోన్స్ అని చూపించే వెబ్ సైట్స్ ను బ్లాక్ చేయండి. మీ డివైస్ (మొబైల్ లేక కంప్యూటర్) లో పరిమితికి మించి అనవసరమైన యాప్స్ ఉంచుకోవద్దు. ఈ లింక్ క్లిక్ చేస్తే మీ అకౌంట్లో డబ్బులు పడతాయి, డబ్బులు




గెలుచుకోవచ్చు, సులభంగా లోన్ పొందవచ్చు అని వచ్చే లింకులను ఏ మాత్రం ఓపెన్ చేయవద్దు. మీకు డబ్బులు వచ్చే అవకాశాలు ఉన్నాయని వచ్చే ఫోన్ కాల్స్‌ని అసలు పట్టించుకోవద్దు. ఇది కేవలం విద్యార్థులకు, యువతకు సంబంధించిన సమస్య మాత్రమే కాదు. ఎంతోమంది ఉద్యోగస్తులు కూడా ఈ బెట్టింగ్ భూతానికి బలయ్యారు. అనకాపల్లి జిల్లాలో బ్యాంకు ఉద్యోగం చేసుకుంటున్న వ్యక్తి ఈ ఆన్‌లైన్ బెట్టింగ్స్‌కి అలవాటు పడి వాటి నుంచి బయటపడటానికి దొంగగా మారాడు. కాబట్టి విద్యార్థులు, ఉద్యోగస్తులు కూడా ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఎప్పటికప్పుడు అలాంటి నోటిఫికేషన్, యాడ్‌లను బ్లాక్ చేస్తూ ఉండాలి.

## ముగింపు

సత్యసాయి జిల్లాకు చెందిన జయచంద్ర డిగ్రీ పూర్తి చేసుకున్న యువకుడు ఆన్‌లైన్ గేమ్స్‌కి బానిసై దాంట్లో నుంచి బయటికి రాలేక ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఆత్మహత్య చేసుకున్నప్పుడు తాను ధరించిన టీ షర్ట్ మీద తను రాసుకున్న క్యాప్షన్ "ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దు. వాటిని డౌన్లోడ్ చేసుకోవద్దు. నాలాగా మోసపోవద్దు". ఇలా ఎంతోమంది అనుభవం మనకు హెచ్చరిక. ఆన్ లైన్ బెట్టింగ్స్ బయటి నుంచి చూడటానికి చాలా ఆకర్షణీయంగా, ఉపయోగకరంగా కనబడతాయి. కానీ వాటిని వాడిన ప్రతి ఒక్కరి సాక్ష్యం మనకు గుణపాఠం. విశ్వాస విద్యార్థులుగా గ్రాడ్యుయేట్స్‌గా మరింత జాగ్రత్తగా ఉండాలి. మాజీ ఐజీ గారు ఓ ఇంటర్వ్యూలో ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది మాదక ద్రవ్యాల (డ్రగ్స్) కన్నా తీవ్రమైన సమస్య అని, యువతకు వ్యసనంగా, దేశ భద్రతకు ముప్పుగా పరిణమిస్తుందని వ్యాఖ్యానించారు. కాబట్టి ఆన్లైన్ బెట్టింగ్స్ విషయాలలో జాగ్రత్త పడుతూ, ఇతరుల ను జాగ్రత్త చేద్దాం!

– ఏ. శివరామకృష్ణ, స్టాఫ్, పిడుగురాళ్ళ




# వ్యక్తిగత జీవిత లక్ష్యము

బైబిలులో కొందరిని చూసినప్పుడు దేవుడు వారిని ఆ పనికోసమే ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకొన్నాడనిపిస్తుంది. ఉదాహరణకు అబ్రహామును జనాంగాలను ఆశీర్వదించటానికి, మోషేను ఇశ్రాయేలీయులను ఐగుప్తు బానిసత్వము నుండి విడిపించటానికి, పౌలును అన్యజనుల కొరకు దేవుడు పిలుచుకొన్నాడని స్పష్టంగా అర్థమవుతుంది. అదేవిధంగా మనందరిపట్ల దేవునికి ప్రత్యేక ఉద్దేశ్యం ఉందని దేవుని వాక్యం స్పష్టం చేస్తుంది.

## మనల్ని ఎన్నుకోవడంలో దేవుని ఉద్దేశ్యం

1 పేతురు 2:9 – దేవుని గుణాతిశయములను, అనగా ఆయన గొప్పతనాన్ని ప్రకటించడానికి

ఎఫెసీయులు 2:10 – మన కోసం దేవుడు ముందుగానే సిద్ధం చేసిన మంచి పనులు చేయడం కొరకు మరియు వాటిలో నడుచుకోవటానికి

ఎఫెసీయులు 1:4 – దేవుని సమక్షంలో పవిత్రంగా మరియు పరిపూర్ణంగా ఉండాలని జగత్తు పునాది వేయబడకముందే ఏర్పరచుకొన్నాడు

మత్తయి 28:19 – అన్ని దేశాలకు వెళ్ళి సమస్త జనులను శిష్యులను చేయడానికి

ఈ వాక్య భాగాలను చూసినప్పుడు మన వ్యక్తిగత జీవితాలు, సేవపట్ల దేవుడు ప్రత్యేక ఉద్దేశం కలిగి ఉన్నట్లు విశదమవుతుంది. మన పనేమిటంటే "నాపట్ల దేవుని ఉద్దేశమేమిటి? నేను ఏమి చేయాలని దేవుడు కోరుకొంటున్నాడు?" అనేది తెలుసుకొని తదనుగుణంగా లక్ష్యాన్ని ఏర్పరచుకొని పనిచేసి దేవుని సంతోషపరచాలి. వ్యక్తిగత మిషన్ స్టేట్‌మెంట్ రాసుకోవడం ద్వారా ఇది సాధ్యమవుతుంది.

## వ్యక్తిగత దర్శనము, జీవిత మిషన్

### దర్శనము:

- ❖ మీరు చేస్తున్న పనిని ఎందుకు చేస్తున్నారో తెలిపేది
- ❖ ఇది మీ ఉనికికి కారణము/ఆధారము (ఈ సమయమును బట్టియే – ఎస్తేరు 4:14)
- ❖ భవిష్యత్తులో మీరు ఏమి సాధించాలనుకుంటున్నారో దాని పెద్ద చిత్రం
- ❖ మీరు సాధించాలనుకుంటున్న దాని మానసిక చిత్రం
- ❖ ఒక నాయకుడు భవిష్యత్తులో తన బృందం ఎలా ఉంటుందో, ఏమి చేస్తుందో చూసే స్పష్టమైన చిత్రం

పౌలుకు తన దర్శనము స్పష్టంగా తెలుసు కాబట్టి అగ్రిప్ప రాజు ఎదుట ధైర్యంగా నిలబడి తన సాక్ష్యాన్ని చెప్పి, ఆ పరలోకపు దర్శనానికి



అవిధేయుడను కాలేనని, అందువలననే వివిధ ప్రాంతాలలో సువార్త ప్రకటన చేస్తున్నట్లు చెప్పాడు (అపో 26:16-20). యు.ఇ.యస్.ఐ. సభ్యునిగా విద్యార్థి పరిచర్య నా దర్శనం అని చెప్పకముందు దేవుని అడిగి దానిని నిర్ధారణ చేసుకోవటం అవసరం. యుఇయస్ఐ సభ్యునిగా కొనసాగుతూ, దర్శనం విషయంలో సందిగ్ధత ఉంటే, పరిచర్యలో ముందుకు పోతున్నప్పుడు ఏదో ఒక సమయంలో, దేవుడు స్పష్టం చేస్తాడు.

*దర్శనం లేని చోట ప్రజలు నశిస్తారు"*

*- సామె 29:18*

❖ దర్శనం ప్రకారం పనిచేయడంలో వైఫల్యం వ్యక్తిగత స్తబ్ధత, సమస్యాత్మకమైన ఆత్మ మరియు విమర్శనాత్మక వైఖరికి దారి తీస్తుంది.

❖ దర్శనం యొక్క నెరవేర్పు మిమ్మల్ని దేవునికి మరియు మీ తోటివారికి చేసే అద్భుతమైన సేవ యొక్క ఔన్నత్యానికి దారి తీస్తుంది.

❖ ఏ దర్శనం అయినా దేవుని గురించిన అవగాహన, స్వీయ అవగాహన, ఇతరుల నిజమైన అవసరాన్ని అర్థం చేసుకోవడం ద్వారా ప్రారంభం కావాలి. గనుక పరిచర్య విషయంలో మొదటిగా ఉండవలసింది స్పష్టమైన దర్శనం.

**మిషన్:**

❖ మీరు దర్శనాన్ని ఎలా సాధించాలనుకుంటున్నారో దాని సాధారణ ప్రకటన

❖ దర్శనం ఎలా సాధించబడుతుందనే సాధారణ ప్రకటన

❖ సాధారణంగా to అనే పదంతో ప్రారంభమయ్యే చర్య ప్రకటన

❖ దర్శనంతో పని చేయడానికి నిబద్ధత

❖ వ్యక్తి/సంస్థ ఉనికికి ప్రాథమిక కారణాన్ని అందించే ప్రకటన

**గురులు:**

❖ మిషన్‌ను నెరవేర్చడానికి ఏమి చేయాలో తెలియజేసే సాధారణ ప్రకటనలు

❖ మిషన్ సాధించడానికి మెట్లు

## జీవిత లక్ష్యం రాసుకోవటం వలన కలిగే ప్రయోజనాలు

❖ హృదయపూర్వకంగా, వ్యక్తిగత మిషన్‌ను ఏర్పాటు చేసుకొని, కొనసాగడం నీ దృష్టిని కేంద్రీకరించడానికి, శక్తివంతంగా మరియు ఉత్పాదకంగా పరిచర్య చేయడానికి హామీ ఇస్తుంది.

❖ మీ జీవిత లక్ష్య ప్రకటన మీ ప్రయత్నానికి జీవనాడి అవుతుంది.

❖ జీవిత లక్ష్య ప్రకటనలో ప్రతిధ్వనించే, ఇష్టపూర్వకంగా పాల్గొనే ఇతరులను ఉత్తేజపరుస్తుంది.

❖ అన్ని సమస్యలు/అడ్డంకులను అధిగమించి దృష్టి కేంద్రీకరించడానికి దోహదపడుతుంది (2 కొరిం 6:4-5)

❖ సరైన ప్రాధాన్యతలతో, చక్కని ప్రణాళికలతో పరిచర్య చేయటానికి వీలు కలుగుతుంది.

❖ లక్ష్యం సాధించడానికి సహాయపడుతుంది (2 తిమోతి 4:7)

*"నువ్వు ఏమి చేసినా, సగం సగంగా చేయకు."*

*- బాబ్ బీమన్*

## జీవిత లక్ష్యం రాయడంలో ఎదురయ్యే అడ్డంకులు

❖ జీవితం యొక్క ఉద్దేశ్యం తెలియక పోవటం

❖ స్పష్టమైన దర్శనము లేకపోవటం

❖ దేవునితో సాన్నిహిత్యం లేకపోవడం

❖ నశించే ఆత్మలపట్ల భారం లేకపోవడం

❖ స్వార్థం (నేను రక్షింపబడ్డాను చాలు)

- తన సామర్థ్యం గురించి తెలియక పోవటం
- ఆత్మ న్యూనతాభావం
- తప్పుడు ప్రాధాన్యతలు
- ప్రాపంచిక ప్రభావాలకు లోనవటం
- సహవాసం లేకపోవడం
- చొరవ చూపలేకపోవడం
- కుటుంబ సభ్యుల మద్దతు లేకపోవడం
- ఒప్పుకోని పాపం
- దేవుని పట్ల భయం లేకపోవడం
- భయము, ఆందోళన

## వ్యక్తిగత జీవిత లక్ష్యము/మిషన్ స్టేట్‌మెంట్

ప్రజల కోసం దేవుని దర్శనాన్ని నెరవేర్చడానికి నాయకుడు పాల్గొనాలని, దేవుడు కోరుకునే నిర్దిష్ట కార్యకలాపమే మిషన్. మిషన్ దేవుని హృదయంలో ప్రారంభమవుతుంది. దేవుని మిషన్‌ను తెలుసుకోవాలన్న తీవ్రమైన వాంఛ మనము కలిగి ఉండాలి.

- లైఫ్ మిషన్ అనేది నీ జీవితంలో, నీ ద్వారా ఏమి జరుగుతుందనే చిత్రమే
- జీవిత లక్ష్యమనగా ఒక నాయకుడు తనకున్న భారాలు, సామర్థ్యాలు, బాధ్యతల మేలు కలయిక ద్వారా ఒక జన సమూహాన్ని ప్రభావితం చేసి వారిలో మార్పు తీసుకు రావటమే.

మూడు ముఖ్యమైన ప్రశ్నలు మన వ్యక్తిగత లక్ష్యాన్ని అవగాహన చేసుకోవటంలో సహాయపడతాయి. అవి

**ఎవరు – వ్యక్తులు:** (నిర్దిష్ట సమూహం – పిల్లలు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, ఖైదీలు ..)

**ఏమిటి – ప్రయోజనం:** (ప్రజలలో రావాలను కొంటున్న నిర్ధిష్టమైన మార్పు)

**ఎలా – ప్రక్రియ:** (తీసుకోవలసిన నిర్దిష్టమైన చర్య)

ఉదాహరణ: అపొస్తలుడైన పౌలు (రోమా 1:5; 15:16); దేవుడు (యోహాను 3:16); పండిత రామా బాయి

గమనిక: జీవిత లక్ష్యం నిర్ధారించుకొనేటప్పుడు వ్యక్తిగత, కుటుంబ కోరికలు దేవుని కోరికతో సరి పోయేలా చూసుకోవాలి.

## వ్యక్తిగత మిషన్ స్టేట్‌మెంట్ రాయడం

- **ప్రజలు (People)** – దేవుడు ఎవరి కోసం నీకు భారం ఇచ్చాడు? (లక్ష్య సమూహం)



- **ప్రయోజనం (Purpose)** – ఎంచుకొన్న సమూహంలో జరగవలసిన మార్పు ఏమిటి? (పరివర్తన)
- **ప్రక్రియ (Process)** – దేవుని మిషన్‌ను నెరవేర్చడానికి నీ ప్రమేయం ఏ విధంగా ఉంటుంది? (నీకున్న సామర్థ్యం ఏమిటి? నీవు చేసే ప్రయత్నం ఏమిటి?)

దేవుడు ఒక వ్యక్తిని ఒక ప్రత్యేకమైన పనికొరకు ఎన్నుకొన్నప్పుడు, దానికి అవసరమైన సామర్థ్యం, నైపుణ్యాలు ఖచ్చితంగా ఇస్తాడు. ప్రత్యక్ష గుడారము, నిబంధన మందసము, ఇంకా ఇతరములైనవి చేయటానికి దేవుడు బెసలేలును పిలిచినప్పుడు (నిర్గ 31:1–10), ఆ పనులు చేయటానికి అవసరమైన జ్ఞాన విద్యా వివేకములను, నైపుణ్యాలను, ఇతరులకు నేర్పించే సామర్థ్యంను ఇచ్చి, అతని నాయకత్వములో పని జరిగించినట్లు నిర్గమ కాండంలో చూస్తాము. లక్ష్య సమూహం, వారిలో రావలసిన మార్పు రాసుకొన్న తరువాత, దేవుడిచ్చిన సామర్థ్యాలయిన కృపా వరాలు, తలాంతులు, నైపుణ్యాలు, ఇతర వనరులు గుర్తించుకోవాలి. మిషన్ రాసుకొన్న తరువాత అవసరమైన సామర్థ్యాలను మెరుగు పరచుకోవాలి.

## వ్యక్తిగత మిషన్ స్టేట్‌మెంట్

నా లక్ష్యం/మిషన్ (సామర్థ్యం/ప్రయత్నం/వృద్ధి) కాబట్టి (ఆందోళన/లక్ష్య సమూహం) (మార్పు/పరివర్తన) మారతారు.

ఉదా: పౌలు వ్యక్తిగత మిషన్

లక్ష్య సమూహము – అన్యజనులు

ప్రయత్నము – సువార్త ప్రకటన

పరివర్తన– అన్యులు పరిశుద్ధాత్మ ద్వారా పవిత్రం చేయబడి, దేవునికి ఆమోదయోగ్యమైన అర్పణ కావడం



**మిషన్ స్టేట్‌మెంట్ –** నా లక్ష్యం సువార్త ప్రకటన ద్వారా అన్యుల నుండి ప్రజలను విశ్వాసం నుండి వచ్చే విధేయతకు పిలవడం, తద్వారా వారు పరిశుద్ధాత్మ ద్వారా పవిత్రం చేయబడి దేవునికి ప్రీతికరమైన అర్పణగా కాగలరు.

**నా జీవితంలో...**

1996 సం॥ లో ఒక కౌన్సిలింగ్ సెమినార్‌లో మొదటిసారి వ్యక్తిగత మిషన్ గురించి విన్నప్పుడు యుఇయస్ఐ దర్శనమే నా దర్శనం, యుఇయస్ఐ మిషనే నా మిషన్ అని ఆ విషయాన్ని పట్టించుకోలేదు. మరలా 2000 సం॥ హగ్గయి సెమినార్‌లో అదే రిసోర్స్‌పర్సన్ అదే విషయాన్ని చెప్పి ఒక సవాలు విసిరారు. "ఈ పది రోజుల సెమినార్ ముగిసేలోగా మీరు మీ మిషన్ రాసుకోకపోతే ఇంటికి వెళ్ళాక రాసుకోలేరని". అక్కడ నేను నా మిషన్ రాసుకొని ఆయనతో సరిచేయించుకొని, దాని ప్రకారం పని చేయటం వలన నా పని విషయంలో స్పష్టత ఉంది.

**నా వ్యక్తిగత మిషన్ స్టేట్‌మెంట్**

నా లక్ష్యం సౌవార్తిక విద్యార్థులు మరియు పట్టభద్రులకు గురువు(టీచర్)గా మరియు మార్గదర్శిగా ఉండడం ద్వారా వారు ప్రభావవంతమైన క్రైస్తవ నాయకులుగా మారతారు.

ప్రతి ఒక్కరూ తమపట్ల దేవుని ఉద్దేశాన్ని గ్రహించి, దానికి అనుగుణంగా వ్యక్తిగత మిషన్ స్టేట్‌మెంట్ రాసుకొని పరిచర్యలో కొనసాగటానికి మన ప్రభువైన యేసు క్రీస్తు సహాయము చేయునుగాక! ఆమెన్.

**– వి. గౌరీ కుమారి,** తెనాలి

# హైకూలు

సిలువను క్రైస్తవులు మొయ్యాలి
గుడి మీద నిలువ బెట్టారు

..........

దేవుని కోసం మండేవాడు
కాలిపోడు

..........

ప్రేమించడం మానేశాడు
పదండి, పాతిపెడదాం!

..........

సంఘంలో తుఫాను
యోనాను దించెయ్యండి

..........

చీమలు
సోమరి పాఠ్యపుస్తకాలు

..........

నీలోని దేవుణ్ణి చూడాలి
నువ్వెందుకు, అడ్డం!

..........

గాజులాంటి జీవితం
దేవుని చేతిలో భద్రం!

..........

గాడిదవు, నీకు చర్చిలో ఏం పని?
బిలాము వచ్చాడేమోనని!

..........

సమస్యలు –
మనిషికంటే పెద్దవి
దేవుని కంటే చిన్నవి.

..........

ఎంత గొప్పగా చేసావు నన్ను!
నువ్వు కూడా నాలో సరిపోయావు!!

– ప్రసాద్ తాళ్ళూరి

ప్రత్యేకం



# దేవుడిచ్చిన దర్శనాన్ని ఎప్పుడు కోల్పోతాము?

*“క్రైస్తవ జీవితానికి రెండు అవసరమైన అంశాలు విజన్ (దర్శనం), ప్యాషన్ (తీవ్రోత్సాహం). ఇవి రెండూ ప్రార్థనలో జన్మించి, దానిలోనే కొనసాగుతాయి.”*
*– లియెనార్డో రేవన్‌హిల్*

సర్వేంద్రియానాం.. నయనం ప్రధానం అంటారు. మనిషి శరీరంలో అన్ని అవయవాల కంటే కంటికి ఉన్న ప్రత్యేకత వేరు. మనకు చూపు సరిగా ఉంటేనే ఏ పనైనా చేయగలుగుతాం. అటువంటి కళ్ళ విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే ఒక్కోసారి చూపుకే ప్రమాదం వస్తుంది. చాలామందికి ఒక్కోసారి చూపు మసక మసకగా కనిపిస్తూ ఉంటుంది. అందుకు ఎన్నో కారణాలు ఉంటాయి.

చూపు ఒక వ్యక్తికి ఎంత ప్రాముఖ్యమైందో, ఒక విశ్వాసికి దేవుడిచ్చిన దర్శనం అంత ప్రాముఖ్యమైంది. చూపు మసక బారినట్లే నేటి దినాల్లో దర్శనం కూడా మసకబారి, కోల్పోయే పరిస్థితులు సంభవిస్తున్నాయి. విశ్వాసుల జీవితంలో దేవుడిచ్చిన దర్శనం మసకబారి/ కోల్పోయే పరిస్థితులు ఎప్పుడు వస్తాయో చూద్దాం.

### 1. విశ్వాస సహితమైన జీవన శైలి లేనప్పుడు

దేవునిపై నమ్మకంతో ఆయన విధానాల మీద ఆధారపడి నడవడం ద్వారా మనం మన దర్శనంలో కొనసాగగలం. మన నిరీక్షణ జీవముతో కూడినది, దేవుడు అక్షయమైనదియు నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము మనకు ఇచ్చాడు. మనం దానిని నమ్మి విశ్వాస జీవితాన్ని జీవించలేకపోతే మన దర్శనాన్ని కోల్పోతాము.

### 2. పరిశుద్ధ జీవితం లేనప్పుడు

మనం పరిశుద్ధంగా జీవించడం, అన్ని విషయాల్లో దేవునితో మమేకం అవ్వడం, ఆయన ప్రజలతో సహవాసం చాలా ప్రాముఖ్యమైన విషయాలు. పరిశుద్ధంగా ఉండడం అనేది రెండు రకాలుగా ఆలోచించవచ్చు.

ఎ. విభిన్నమైన జీవితం, ఇతరులకు వేరుగా ఉండడం.

బి. మన పూర్వపు జీవితానికి, ప్రస్తుతానికి భిన్నంగా జీవించడం.

జాన్‌స్టాట్ గారు రాసిన రాడికల్ డిసైపుల్‌షిప్ అనే పుస్తకంలో ‘నాన్ కన్ఫార్మిటీ విత్ వరల్డ్’ అని రాస్తూ క్రీస్తు శిష్యులంగా మనం ప్రత్యేకంగా ఉండాలి, ప్రపంచానికి అనుగుణంగా ఉండకూడదని చెబుతారు. మనం పరిశుద్ధంగా జీవించడం కోసం ప్రపంచం నుండి పారిపోలేము, అలాగని ప్రపంచంతో రాజీపడలేము. ప్రస్తుత సమకాలీన పోకడలతో (ప్లూరలిజం, మెటీరియలిజం, రిలేటివిజం, నార్సిసిజం) మనం రాజీపడలేనప్పుడు దర్శనంలో కొనసాగగలం.



**మనం దర్శనంలో కొనసాగాలంటే, మౌళిక విలువలు, ప్రార్థన మన అలవాటుగా మారాలి. అంటే మోకాళ్ళ మీద ఉండే వ్యక్తులు సహవాసంలో ఉన్నంత కాలం మన దర్శనం చెక్కుచెదరదు.**

### 3. క్రీస్తులో మన పునాది లేకపోతే

యేసు ప్రభువు వారు కొండమీద ప్రసంగాన్ని ముగిస్తూ రెండు రకాల ఇల్లుల గురించి ప్రస్తావించి ముగించారు. ఈ నా మాటలు విని వాటి ప్రకారం చేయు ప్రతివాడు బండమీద తన ఇల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును మరియు ఈ నా మాటలు విని వాటి చొప్పున చేయని ప్రతివాడు ఇసుక మీద తన ఇల్లు కట్టుకొనిన బుద్ధిహీనుని పోలియుండును. మన పునాది క్రీస్తులో కాకపోతే మన దర్శనం నుండి ప్రక్కకు వెళ్ళే ప్రమాదం ఉంది. దర్శనంలో కొనసాగడానికి మనం నిత్యము దేవుని వాక్యముతో మమేకమవ్వాలి. ఆయన యందు విశ్వాసముంచువాడు ఏ మాత్రము సిగ్గుపడడు.

### 4. సత్యానికి వినయంతో లోబడకపోతే

క్రీస్తు సత్యాల కొరకు దృఢసంకల్పం, వినయంతో లోబడడం ద్వారా దర్శనంలో కొనసాగగలం. శరీరాశలను విసర్జించి అన్యజనులు ఏ యే విషయాలలో దూషణ చేయుదురో మీ సత్ క్రియల ను చూచి, వాటిని బట్టి దర్శన దినమున దేవుని మహిమపరచునట్లు, వారి మధ్యను మంచి ప్రవర్తన గలవారై యుండవలెను (1 పేతురు 2:12).

### 5. మండే జీవితం లేకపోతే

క్రీస్తు కొరకు, పరిచర్య కొరకు మండుచున్న జీవితం గలవారు దర్శనం నుండి తొలిగిపోరు, కీడుకు ప్రతికీడు, దూషణకు ప్రతి దూషణ చేయరు, మేలు చేయుటయందు ఆసక్తిగలవారుగా ఉన్నప్పుడు నీతి నిమిత్తం శ్రమపడుచూ క్రీస్తు మాదిరిగా గల జీవితం గలవారు మండుచూ దర్శనంలో కొనసాగుతుంటారు.

### 6. పిలుపుకు, ఉద్దేశ్యాలకు తగినట్లుగా జీవితం లేకపోతే

దేవుని ఉద్దేశ్యాల ప్రకారం నడవకుండా ఆయన పిలుపులో కొనసాగనట్లయితే దేవుని దర్శనాన్ని మన జీవితంలో కొనసాగించలేము. పాపంలో కొనసాగినప్పుడు, ప్రార్థన లేమి, మెలకువగా లేని పరిస్థితులు విశ్వాసులలో ఉన్నప్పుడు మన దర్శనం నుండి దూరం అవుతాము.

### 7. ఆత్మీయ మెలకువ, అప్రమత్తంగా లేనప్పుడు

ఆత్మీయంగా మెలకువ, అప్రమత్తత, విశ్వాస జీవితం లోపించినప్పుడు మనం మన దర్శనాన్ని మరచిపోయే ప్రమాదంలో పడతాం. విశ్వాసులకు శ్రమలు సహజం, శోధనలు జయించే అనుభవం లోనికి రావాలి. దేవుని ఆత్మ మనలో ఉండి మనలను నడిపించే అనుభవాన్ని కోల్పోయినప్పుడు దర్శనాన్ని కోల్పోతాము. దేవుని చిత్త ప్రకారం బాధపడేవారు సత్ప్రవర్తన గలవారై నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకోవాలి.

### దర్శనం కోల్పోతే వ్యక్తిగతంగా, పరిచర్యలో కలిగే నష్టాలేంటి?

**వ్యక్తిగతంగా...**

1. జీవితం గురి, గమ్యం లేనిదిగా ఉంటుంది.
2. దేవుడిచ్చిన సామర్థ్యాలను, వనరులను వ్యర్థంగా ఖర్చు పెడతాము, మంచి గృహ నిర్వాహకునిగా కొనసాగలేము.
3. ప్రజలు నశిస్తారు.
4. దేవుని ముందు దోషిగా నిలబడాలి.

**పరిచర్య పరంగా**

1. పరిచర్య అభివృద్ధి ఆగిపోతుంది.
2. మాదిరి జీవితం కొరవడుతుంది.
3. నాయకత్వం లోపిస్తుంది, నాయకులు తయారుకారు.
4. సమస్యలు అధికమవుతాయి.
5. ఉద్యమంలో జీవం ఉండదు, గుర్తులు మాత్రమే ఉంటాయి.
6. అవసరాలు తీర్చబడవు.
7. విద్యార్థులు చెడిపోతారు, నశిస్తారు, దేశం నష్టపోతుంది, పాపం పెరుగుతుంది.

## దేవుడిచ్చిన దర్శనంలో కొనసాగాలంటే ఏం చేయాలి?

### 1. దేవుని మాట వినాలి

దీనిలో నాలుగు విషయాలు ఉన్నాయి. దేవుని వాక్యాన్ని చదవడం, రాయడం, ప్రకటించడం, ధ్యానించడం. ఇలా చేయడం ద్వారా దేవునితో మమేకమవుతాము. రాశిలో, వాసిలో వర్ధిల్లుతాము.

విద్యార్థి దర్శనం మన పూర్వీకులకు దేవుడు అనుగ్రహించినది. దర్శనంలో కొనసాగాలన్నా, దర్శనం సజీవంగా ఉండాలన్నా దర్శనానికి మూలమైన దేవుని మాట ప్రతి దినం వినాలి. మోకాళ్ళ మీద ఉండి వినాలి.

మనకు అందించబడిన విద్యార్థి దర్శనం రెండు ప్రధాన విషయాలపై ఆధారపడి ఉంది. 1. కొండమీద ప్రసంగ సారాంశం, 2. సంవత్సరాల తరబడి చేసిన ప్రార్థన. వీటివల్లే ఈ దర్శనం పుట్టుకొచ్చింది. మనకు అందించబడింది. మనం ఈ దర్శనంలో కొనసాగాలంటే, మౌళిక విలువలు, ప్రార్థన మన అలవాటుగా మారాలి. అంటే మోకాళ్ళమీద ఉండే వ్యక్తులు సహవాసంలో ఉన్నంత కాలం మన దర్శనం చెక్కుచెదరదు.



### 2. దేవుని మాట యందు విశ్వాసముంచాలి

మన విశ్వాసం దేవునిపై, ఆయన వాక్యంపై ఉన్నప్పుడు దర్శనంలో కొనసాగగలం. విశ్వాసానికి ముడిపదార్థం దేవుని వాక్యం. ఈ విశ్వాసం దర్శనంలో కొనసాగేలా చేస్తుంది.

### 3. దేవుని మాటకు విధేయత చూపించాలి

వినిన ప్రకారం, విశ్వాసం ఉంచిన ప్రకారంగా జీవించినప్పుడు దర్శనం నిరంతరం కొనసాగుతూ ఉంటుంది. మన లక్ష్యాలు, సిద్ధాంతాలు, మౌళిక విలువలకు అనుగుణంగా మన ప్రణాళికలు ఉంటే, ఆ ప్రణాళికలతో విధేయతతో పాలొందుతూ, అందివచ్చిన నాయత్వపు అవకాశాలను అందిపుచ్చుకొంటూ కొనసాగినప్పుడు దర్శనం సజీవంగా ఉంటుంది.

– డా. సత్యనారాయణ, భీమవరం

కవిత

# సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ



సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
నీతో కూడా మరణించిన హృదయాన్ని నాకివ్వు
దేవునిలో జీవిస్తున్న జీవితాన్ని నాకివ్వు ప్రభూ
నీ రక్తంతో పవిత్రపరచబడిన జీవితాన్ని నాకివ్వు

స్వార్థం చచ్చిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
ఈ లోకానికి చచ్చిన హృదయాన్ని నాకివ్వు
అహానికీ ఆశలకూ చచ్చిన హృదయాన్ని నాకివ్వు
స్వయం స్వచిత్తం చచ్చిన హృదయాన్ని నాకివ్వు

నా పాత స్వభావాన్ని నీ సిలువలో వ్రేలాడదియ్యి
నేనీలోకాన్ని పెంటలా ఎంచుకొనేలా చెయ్యి
లోకాశలన్నీ చచ్చిపోయేంతగా నన్ను పవిత్రపరచు
లోకానికి చచ్చినంతగా నన్ను పరిశుద్ధపరచు

సిలువ వేయబడిన వినయ మనసును నాకివ్వు
సున్నితమైన కరుణగలిగిన మనసును నాకివ్వు
సిలువ వేయబడిన స్వచ్ఛమైన మనసును నాకివ్వు
నీ ప్రతి పిలుపుకు ప్రతిస్పందించే మనసును నాకివ్వు

నా ఆశలు ఆశయాలు సిలువ వేయబడును గాక
నా ప్రేమ పరిపూర్ణతా స్థాయికి చేరుకొనును గాక
నన్ను నా సమస్తాన్ని సిలువకు మేకులతో కొట్టు
నన్ను పూర్తిగా నీ కొరకై సిలువలో సరిదిద్దు

ప్రభూ, నీ మరణం నిరంతరం నాలో ఉండనివ్వు
నా స్వయాన్ని పూర్తిగా సిలువ మేకులకు బంధించు
ప్రతి క్షణం సిలువ వేయబడిన అనుభవం నాకివ్వు
నా స్వరూపాన్ని పూర్తిగా నీ సారూప్యంలోకి మార్చు

– వెస్లీ డ్యూయల్

*(మెజర్ యువర్ లైఫ్ పుస్తకం నుంచి)*

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-04-2025**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# మరణానికి సమాధానం

ఆత్మకు చావు లేదని
ఎరిగిన మనం
మనిషి పోయాడని కాదు
మనిషితనం
మట్టిలో కలుస్తుందని
ఏడుద్దాం రండి!
చావు తర్వాత
నరుల గతి ఏమవుతుందోనని
అందరం కలిసి
ఏడుద్దాం రండి!

కరెంటు తీగ తగిలి
కాలిపోయిన కాకి కోసం
కాకులన్నీ
కావు కావుమని ఏడుస్తూ
కనికరం చూపుతాయి!
కోతులూ కొండముచ్చులూ
కడకు క్రూరమృగాలు సైతం
వాటిలో ఒకదాని ఊపిరి
గాలిలో కలిసినా
బోరున విలపిస్తూ
బాధపడుతూ వుంటాయి!

సర్వేజనా సుఖినోభవంతు
అని గొప్పలు పలికే
గప్పాలమారి మాత్రం
తోటి మనిషి చావును
సంబరంగా జరుపుకుంటున్నాడు!
వెకిలి మాటలతో
వెగటు రాతలతో
మానవత్వాన్ని మళ్ళీ మళ్ళీ
ఖననం చేస్తున్నాడు!

మరణం...
ఈ మట్టి దేహానికే ముగింపు
మహిమ లోకానికి
అది ఆరంభం
నిత్య సంతోషాలకు ప్రారంభం
మృత్యుంజయుని
పునరుత్థానమే
మన నమ్మకానికి ఆధారం!
ఓ మరణమా!
నీ విజయమెక్కడ?
అంటూ మరణపు ముల్లును
విరిచిన
యేసు నామమే
ఈ లోకానికి
మనమిచ్చే సమాధానం!!

– గొంగటి మేరి జాయ్, ఆదోని